# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం





# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

మంగళవారం 19 మే 2026 పేజీలు : 8





గత ప్రభుత్వం లో లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన తెలంగాణలో ప్రతిష్టాత్మక "తెలంగాణ క్రీడా ప్రాంగణాలు" అలంకార పాయంగా మారాయని విమర్శలు వస్తున్నాయి

గ్రామాల్లో పాడుబడుతున్న క్రీడా మైదానాలతో యువతకు క్రీడా సదుపాయాలు అందని ద్రాక్ష పండు లాగా మారాయి

తెలంగాణ క్రీడా ప్రాంగణాలు... లక్షల ఖర్చు, ఇప్పుడు గడ్డిపరకలేనా..?

6

బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం -భారీ ప్రచారం... కాంగ్రెస్ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం..!

# బక్రీద్ సందర్భంగా ముస్లిం, హిందూ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం



ఈనెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, గోవధ నిషేధ చట్టం అమలు, సామాజిక సామరస్యాన్ని కాపాడే అంశాలపై ఈరోజు నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఐఏఎస్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, హిందూ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలు, పశువుల రవాణా నియంత్రణ, చట్ట అమలు అంశాలపై జిల్లా చర్చించారు.

7

# ధాన్యం తరలింపు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

8



జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం తరలింపు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సోమవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

## సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మెల్యే కోవలక్ష్మికి వినతి పత్రం సమర్పణ**



**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):** సింగరేణి కాలరీస్ సంస్థలో వివిధ కారణాలతో పదవి విరమణ పొందిన విశ్రాంత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సింగరేణి వాలంటరీ రిటైర్మెంట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజి. నెం: 4148/97) ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే కోవలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఉదయం 11 గంటలకు జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికులు తమ సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లు వినిపించారు. సింగరేణి సంస్థలో రిటైర్మెంట్ పొందిన ప్రతి కార్మికునికి 10 వేల పెన్షన్ అందించాలని, ప్రతి మూడు నెలలకు పెరిగే డీఏను పెన్షన్‌లో కలిపి చెల్లించాలని కోరారు. రిటైర్డ్ కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్మికుల ఆరోగ్య సమస్యల దృష్ట్యా 25 లక్షల వరకు వైద్య ఖర్చులను సింగరేణి సంస్థ భరించాలని, రిటైర్డ్ కార్మికుల కాలనీలలో రోడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. బస్సు, రైలు ప్రయాణాల్లో ఉచిత సౌకర్యం కల్పించడంతో పాటు వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి ప్రతి రెండు నెలలకు సరిపడా మందులు అందించాలని తెలిపారు.హెల్త్ కార్డు ద్వారా ఆస్పత్రిలో చేరిన కార్మికులకు పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులను సంస్థ భరించాలని, మెడికల్ అన్‌ఫిట్ కార్మికుల పిల్లల పేర్లు లేదా జనన తేదీలలో తప్పులు ఉంటే సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఒక కుటుంబానికి ఒక ఉద్యోగం ఇవ్వాలని, ఉద్యోగం వద్దనుకునే వాలంటరీ మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలను ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగులు కోరారు.ఈ కార్యక్రమంలో బూడిది గోపాలకృష్ణ, గుర్రం గంగయ్య, పిడుగు నారాయణ, దుర్గం శంకర్, బాసబోయిన రవీంద్ర కుమార్, కే యాదగిరి, చిలుకూరి బాలయ్య, పోటు బాబు తదితర రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

## ఖిరిడిలో మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహ ఆవిష్కరణ



**కొమరం భీమ్ జిల్లా ప్రతినిధి( వాంకిడి ) మే 18 ప్రజా జ్యోతి** వాంకిడి మండలంలోని ఖిరిడి గ్రామంలో మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలతో గ్రామ వీధుల గుండా ర్యాలీ సాగింది. ర్యాలీ అనంతరం గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాలి సంఘం నాయకులు తదితరులు రాజకీయ నాయకులు పాల్గొన్నారు

## రామకృష్ణాపూర్ కాంగ్రెస్‌లో నూతనోత్సాహం సంఘటన్ సృజన్ తో సరికొత్త కార్యవర్గం



**రామకృష్ణాపూర్, మే 18(ప్రజా జ్యోతి):**దక్యాతన్‌పల్లి మునిసిపాలిటీ రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పొద్దాల శ్రీనివాస్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, యువతకు అవకాశాలు కల్పించడం, అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, యువజన, కార్మిక వర్గాలకు కొత్త కార్యవర్గంలో తగిన స్థానం కల్పించడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని, కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తల త్యాగాలు మరువలేనివని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్త సమర్థంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షులుగా అకుల రాజయ్య, పనస రాజయ్య, కాసర్ల ప్రకాష్, కట్కూరి శ్రీనివాస రెడ్డి, మందా సృజన, బత్తుల శ్రీనివాస్ నియమితుల య్యారు. ప్రధాన కార్యదర్శులుగా మేకల శ్రీనివాస్, బత్తుల వేణు, గోపు రాజం, మేకల సురేందర్,ఎర్రం విద్యాసాగర్ రెడ్డి, ఎర్రబెల్లి రాజేష్, ఎల్బుల సత్యనారాయణలను నియమించారు. అధికార ప్రతినిధిగా మాదాసు రాజ్ కుమార్, సామాజిక మాధ్యమాల కన్వీనర్‌గా బొద్దుల ప్రేమ్ సాగర్, సహ కన్వీనర్‌గా గుర్రం అనిల్ కుమార్‌ను నియమించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, కొండవేణ పుష్ప, కొలిపాక దీప తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సేవ: అంబలితో దాహం తీర్చిన బీఆర్ఎస్ నేతలు

**కోవ లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద చౌక్‌లో పంపిణీ**



**ఆసిఫాబాద్ మే 18 ప్రజా జ్యోతి** భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు కోవ లక్ష్మి ఫౌండేషన్ ఉపశమనం కల్పించింది. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లని త్రాగునీరు, అంబలి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి బాటసారులకు, స్థానికులకు స్వయంగా అంబలి, మంచినీరు అందించారు. మునిసిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ మహమ్మద్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, సర్పంచ్ బుర్స పోచన్న, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్ బిన్ అబ్దుల్లా పాల్గొన్నారు

## ఎస్.ఎస్.సి లో జిల్లా టాపర్లు గా నిలిచిన కిష్టాపూర్ విద్యార్థులు.

**అభినందించిన జిల్లా కలెక్టర్**

**ఒక్కొక్కరికి పది వేల నగదు పురస్కారం**



**జన్నారం,మే18(ప్రజాజ్యోతి)** ఎస్.ఎస్.సి 2026 పరీక్ష ఫలితాల్లో జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన లశెట్టి శ్వేత 582 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానం,కట్ల సాకేత్ 577 మార్కులతో జిల్లా ద్వితీయ స్థానం సాధించారు.జిల్లా టాపర్లు గా నిలిచిన వీరిని ఆదివారం రోజు మంచిర్యాల ఐడిఓసి కలెక్టరేట్ ఆఫీసులో జరిగిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా విద్యాధికారి యాదయ్య తో కలిసి ఒక్కో విద్యార్థికి పదివేల నగదు పురస్కారంతోపాటు సర్టిఫికెట్, షీల్డ్ ను బహుకరించి అభినందించారు.ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య లభిస్తుందనడానికి ఈ విద్యార్థులే నిదర్శనమని,కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, పాఠశాల ఎ ఎ పి సి చైర్మన్ మంగ, గ్రామ ఉపసర్పంచ్ దేవపాల పాఠశాల ఉపాధ్యాయులు జాడి మురళి,దాముఖ కమలాకర్, గోవర్ధన చారి, రాజన్న ,బుచ్చి లింగయ్య,బాణావత్ ప్రకాష్, గుండి నరహరి శర్మ, వావిలాల వాసు, నగేష్, మనెమ్మ, జ్యోతి శీల, అశోక్, శ్రీనివాస్ ,రజిత రాణి, సుస్మిత, అజీమ్, స్వప్న, కృష్ణమూర్తి, సిఆర్పి శేఖర్, చంద్రకళ, అజయ్, అశోక్, శ్రవణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## రక్త కొరత నేపథ్యంలో రక్తదాన శిబిరాల నిర్వహణ అవసరం

**స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపు**




**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తం అందించే మహత్తర సేవలో భాగంగా డాక్టర్స్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో సోమవారం రక్త బ్యాంకుల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ డాక్టర్ చందన సుధాకర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ వీరశేఖర్, సెక్రటరీ సమ్మయ్య లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్త నిల్వలు, రక్త సేకరణ విధానం, రక్తదాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రక్త నిల్వలు తగ్గిపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తం అందించడం కష్టసాధ్యం గా మారుతోందని తెలిపారు. ప్రమాదాలు, ప్రసూతి అత్యవసరాలు, శస్త్ర చికిత్సలు, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతిరోజూ రక్తం అవసరం అవుతోందన్నారు.ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచి స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించేం దుకు రక్తదాన శిబిరాల నిర్వహణ ఎంతో అవసరమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడవచ్చని, సమాజంలోని ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటాలని పిలుపునిచ్చారు."మీ ఒక్క యూనిట్ రక్తం... మరొకరి జీవితానికి ఆశాకిరణం" అని తెలిపారు.

## ప్రజావాణిలో కలెక్టర్‌కు 3వ వార్డు అర్హుల జాబితా అందజేత

"డబుల్ బెడ్ రూమ్‌లో మాకు జీరో.. ఇందిరమ్మలో న్యాయం చేయండి"



మంచిర్యాల, 18,మే (ప్రజా జ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీ 3వ వార్డు పరిధిలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ 3వ వార్డు కౌన్సిలర్ బెడ్డల సౌజన్య విజయ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, అంబేద్కర్ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలకు చెందిన అర్హుల జాబితాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మా 3వ వార్డులో ఎంతో మంది నిరుపేద కుటుంబాలు గత 30 ఏళ్లుగా రేకుల షెడ్లు, గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో మా వార్డుకు ఒక్క ఇల్లు కూడా రాలేదు. పలుమార్లు సర్వేలు నిర్వహించి గ్రామసభల్లో పేర్లు చదివినా ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదు. వీరంతా నిజమైన అర్హులు. రెండో విడతలో అయినా ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలి" అని కలెక్టర్‌ను కోరారు.అర్హుల కుటుంబ సభ్యుల పేర్లు, అప్లికేషన్ నంబర్లు, ఫోన్ నంబర్లతో కూడిన పూర్తి జాబితాను కలెక్టర్‌కు అందజేశారు.వినతి పత్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, అంబేద్కర్ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల అర్హుల జాబితాను స్వయంగా పరిశీలించి, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఈ నెల 20న మెడికల్ షాపుల బంద్



రామకృష్ణాపూర్, మే 18(ప్రజా జ్యోతి): ఆన్‌లైన్ మందుల విక్రయాలు, కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపునిచ్చిన మే 20 దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్‌కు క్యాతన్‌పల్లి మెడికల్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. ఆన్‌లైన్ అమ్మకాలు నిలిపివేయాలి, కార్పొరేట్ సంస్థలు అధిక ఎంఆర్పి వేసి డిస్కౌంట్ పేరుతో మోసం చేయడం ఆపాలి, నకిలీ మందుల విక్రయాలు అరికట్టాలని ప్రధాన డిమాండ్లను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, మంచిర్యాల జిల్లా సంఘం పిలుపు మేరకు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాపులు బంద్‌లో పాల్గొంటాయన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏ ఎస్ ఐ వెంకన్న గారికి వినతి పత్రం ఇచ్చిన నేతలు, అత్యవసర మందుల కోసం 9440445143, 9666128040, 9866443876 నంబర్లను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంతోష్ కుమార్, సీనియర్ కెమిస్ట్ సలీం, సౌజన్య రెడ్డి , గద్దం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలి

## ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధులు జమ చేయని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల, 18, మే (ప్రజాజ్యోతి): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి, వారి సమస్యలను పరిష్కరిం చాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల ఇంచార్జి సత్యంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎంఈ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఏజెన్సీలను సంప్రదించి నప్పుడల్లా "రేపు-మాపు" అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. దీంతో ఉద్యోగులు అప్పులపాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కొన్ని ఏజెన్సీలు ఉద్యోగుల ఈపీఎఫ్ నిధులను సక్రమంగా జమ చేయకపోవడంతో పాటు ఈఎస్ఐ కార్డులు, గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు ప్రతి నెల



5వ తేదీలోపు జీతాలు ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈపీఎఫ్ డబ్బులు జమ చేయని ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని, ప్రతి నెల పే స్లిప్‌లు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, డ్రెస్ కోడ్, అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వినేశ్, దీపక్, సంజీవ్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):మంచిర్యాల జిల్లాలో "ప్రజావాణి" కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులందరు సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములతో కలిసి అర్జీదారుల నుంచి సోమవారం దరఖాస్తులను స్వీకరించారు.మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలోని ఎస్సీ నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయం లో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు.మండల ప్రత్యేక అధికారులుగా నియమించబడిన జిల్లా



అధికారులు తమ మండలాల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, దిగుమతి, హమాలీల సంఖ్య పెంపుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు పర్యాటక రంగం ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాల సంబంధిత కరపత్రాలు, గిరిజనుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జన జాతీయ గరిమ ఉత్సవ్--2026 సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యువ టూరిజం క్లబ్, అవగాహన కార్యక్రమాలు, హెరిటేజ్ వాక్, స్థానిక ఇన్ఫ్లుయెన్సర్/యూట్యూబర్లతో సమావేశం, స్వచ్ఛత, టూరిజం బ్రాండ్ విడుదల, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్‌లో భాగంగా గిరిజన గ్రామాలలో రహదారులు, త్రాగునీరు, ఆరోగ్యం, విద్యుత్, ఇండ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం పట్ల ధర్మం పట్ల కుటుంబంలో ప్రతి ఒక్కరు కలిసి ఉండాలి

## అందరికి తెలిసే విధంగా హిందూ కుటుంబాలు ఆదర్శప్రాయంగా మారాలి

## మంచిర్యాల టూ టౌన్ లో 800 మంది తో ఘనంగా హిందూ సమ్మేళనం







**మంచిర్యాల ,18, మే (ప్రజాజ్యోతి)** :దేశం పట్ల ధర్మం పట్ల కుటుంబంలో ప్రతి ఒక్కరు కలిసి ఉండే విధంగా కూడా వారందరికీ తెలిసే విధంగా మన కుటుంబాలు ఆదర్శప్రాయంగా ఉండాలని వక్తలు అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందువులను జాగృతం చేయడం కోసం దేశమంతా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాలలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో టూ టౌన్ శివాజీ గ్రౌండ్ లో ఆదివారం రాత్రి ఎనమిది వందల " హిందువులతో సమ్మేళనం" ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంతెన సతీష్ పాల్గొని సమ్మేళన ఉద్దేశించి మాట్లాడారు. హిందువులపై జరుగుతున్న దాడులను లవ్ జిహాద్ పై హిందూ అమ్మాయిలను చిత్రహింసలు గురి చేస్తున్నా ఇతర మతాలపై అడ్డుకునే విధంగా హిందూ సమాజం ప్రతి ఒక్కరూ జాగ్రత్త కావలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సరస్వతి శిశుమందిర్ కార్యకారిణి సభ్యురాలు చందా వింధ్య మాట్లాడుతూ, కుటుంబ వ్యవస్థలో గురించి దేశం పట్ల ధర్మం పట్ల కుటుంబంలో ప్రతి ఒక్కరు కలిసి ఉండే విధంగా కూడా వారందరికీ తెలిసే విధంగా మన కుటుంబాలు ఆదర్శప్రాయంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ విభాగ్ ప్రచారం ప్రముఖ్ తడిగోప్పుల శంకరయ్య అధ్యక్షులు గరిమిళ్ళశ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్ణకంటి రవీందర్,పర్వతాల నర్సయ్య,సభ్యులు దెబ్బటి శంకర య్య, పోటు తిరుపతి రెడ్డి, వీరచారీ, సదానందం,ఆకుల దిలీప్, రామగిరి శ్రీనివాస్, కంకణాల శ్రీనివాస్ ఉస్మామల్ల శంకర్, అమిత్ కృష్ణ,కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జాతీయ గీత తో పూర్తి చేశారు. ఈ కార్యక్రమం కోసం సహాయ సహకా రాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా " హిందూ సమ్మేళ నం" టూ టౌన్ కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారమే చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. మంచిర్యాల జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి, భీమారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం కలెక్టర్ సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తూ రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు తదితర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు వెంటనే తరలించాలని ఆదేశించారు. అనంతరం భీమారం మండలం అంకుశపూర్, నస్పూర్ మండల కేంద్రంలోని రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి కలెక్టర్ సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని సూచించారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, అవసరానికి అనుగుణంగా హమాలీల సంఖ్య పెంచుకోవాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూరుస్తామని పేర్కొన్నారు. రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దండేపల్లిలో ఇళ్ల గణన పరిశీలన



**దండేపల్లి మే 18 (ప్రజాజ్యోతి)** జన గణన – 2027లో భాగంగా మండలంలో జరుగుతున్న ఇళ్ల గణనను తాసిల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో జే. ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా పక్కాగా వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ భూమన్న, ఏఎస్ఓ రమేష్, సూపర్‌వైజర్ రాజన్న, సిబ్బంది నర్సయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ న్యాయ సేవ సమితి మండల సభ్యునిగా గుడ్ల రవి



**లక్ష్మణ చాంద, మే 18 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర కమిటీ సూచనల మేరకు తెలంగాణ న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి వ్యవస్థాపకులు మరియు రాష్ట్ర అధ్యక్షులు చాపల కిరణ్ కుమార్ ఆమోదంతో రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీ పుచ్చుల నాగేష్ నిర్మల్ జిల్లా సూచనల మేరకు సోమవారం రోజున లక్ష్మణ చాంద మండల తెలంగాణ న్యాయ సేవ మండల కమిటీ సభ్యునిగా గుడ్ల రవిని నియమించి నట్లు ప్రజా చైతన్య సమితి వారు తెలిపారు.

## యువత ఆరోగ్యం పై దృష్టి సారించాలి

**అదనపు కలెక్టర్ రాజేశ్వర్**



**ఆదిలాబాద్ బ్యూరో,మే 18, (ప్రజా జ్యోతి)** యువత ఆరోగ్యంపై దృష్టి సా రించాలని స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సి పల్ చైర్పర్సన్ బండారి అనూష అన్నారు. సోమవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టే డియం నుంచి చేపట్టిన 5కె మారథాన్ రన్ లో వారు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్, అంబెద్కర్ చౌక్ మీదుగా తిరిగి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు సాగింది. ఈ రన్‌లో ఉద్యోగులు, యువత, వివిధ వర్గాలవారు, పట్టణ ప్ర ముఖులు, ప్రజలు, ఉత్సాహంగా పాల్గొన్నారు. 5కె రన్ లో గెలిచినా విజేతలకు ఈ సందర్భంగా మెడల్స్, ప్రశంస పత్రాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అంద జేశా రు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నిత్యజీ వితంలో యోగాన్ని భాగస్వామ్యం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సంద ర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలుచే పడుతున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్నికా పాడుకోవడానికి నిత్యం ధ్యానం యోగ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మా ర్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డివైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, డిఆర్డిఓ రాథోడ్ రవీందర్, డిపిఒ రమేష్, సంక్షేమ అధికారి మిల్కా, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, క్రీడ కోచ్లు, అధికారులు, యువత, ఉద్యోగులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, తదితరులు పా ల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

**చెన్నూర్, భీమారం మండలాల్లో భారీగా బిటి -3 విత్తనాల స్వాధీనం**




**మంచిర్యాల, 18,మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా చెన్నూర్, భీమారం మండల కేంద్రాల్లో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు కేసుల్లో సుమారు 386 కిలోల ప్రభుత్వ నిషేధిత బిటి -3 పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేసుల వివరాలను వెల్లడించారు.రెండు కేసుల్లో ఐదుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి ఆంధ్రా ప్రాంతం నుంచి నకిలీ పత్తి విత్తనాలను తీసుకువచ్చి జిల్లాలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు.నకిలీ విత్తనాల వాడకం వల్ల భూమి సారవంతత దెబ్బతినడంతో పాటు పంటలకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని డీసీపీ హెచ్చరించారు. రైతులు నకిలీ విత్తనాల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గతంలో కూడా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని రైతులకు సూచించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ నకిలీ విత్తనాల వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంటోందని, ఇలాంటి అక్రమాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కేసుల ఛేదనలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులను డీసీపీ అభినందించారు. వారికి రివార్డులు కూడా అందజేస్తామని తెలిపారు.

---

# భీమారం చెన్నూర్‌లో నకిలీ విత్తనాల ముఠా పై పోలీసుల ఉక్కుపాదం

## 386 కేజీల నిషేధిత హెచ్ టి.బి టి 3 పత్తి విత్తనాలు స్వాధీనం

### ముగ్గురు అరెస్ట్ ఇద్దరు పరార్





**జైపూర్, మే 18 ప్రజా జ్యోతి** రైతులను మోసం చేస్తూ నిషేధిత నకిలీ పత్తి విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు ఛేదించారు.భీమారం, చెన్నూర్ మండలాల్లో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భారీ మొత్తంలో హెచ్ టి.బి టీ 3 రకం నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.జైపూర్ ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ కేసు వివరాలను వెల్లడించారు.ఐదుగురు సభ్యులతో కూడిన ముఠా ఆంధ్ర ప్రాంతం నుంచి నిషేధిత హెచ్ టి బి టీ 3 పత్తి విత్తనాలను అక్రమంగా తెప్పించి, భీమారం, చెన్నూర్ ప్రాంతాల్లో రైతులకు అధిక ధరలకు విక్రయిస్తోంది. విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించగా సుమారు 386 కేజీల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.దాడుల సమయంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని డీసీపీ తెలిపారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు నకిలీ విత్తనాలతో కోట్ల రూపాయల దందా సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిషేధిత విత్తనాల వినియోగం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పంట దిగుబడులు తీవ్రంగా ప్రభావితమవుతాయని, పర్యావరణానికి కూడా హాని కలుగుతుందని డీసీపీ హెచ్చరించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తామని డీసీపీ స్పష్టం చేశారు. ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన భీమారం ఎస్సై ఎ.రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ పి.మల్లయ్య, కానిస్టేబుళ్లు ఎన్.మహేందర్, యువరాజ్, ఎన్.అశోక్‌తో పాటు హోంగార్డులు సదాశివ్, సంతోష్, శ్యామ్‌లను డీసీపీ అభినందించారు. వీరికి త్వరలో ప్రత్యేక రివార్డులు అందజేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో జైపూర్ ఏసీపీ ఏ.వెంకటేశ్వర్లు, సీఐ కె.నవీన్ కుమార్, చెన్నూర్ సీఐ బన్సీలాల్, జైపూర్ ఎస్సై ఎల్.భూమేశ్, మండల వ్యవసాయాధికారి ఎ.సుధాకర్, చెన్నూర్ ఏఓ యామిని తదితరులు పాల్గొన్నారు.

---

## కాంగ్రెస్ కమిటీల ప్రకటింపు

**కాంగ్రెస్‌లో కొత్త బాధ్యతల కేటాయింపు**




**జైపూర్ మే 18 ప్రజాజ్యోతి** జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీలో కొత్త కమిటీల నియామకాలతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు చల్లా విశ్వంబర్ రెడ్డి సూచనల మేరకు జైపూర్ మండల కమిటీకి సంబంధించిన పలు పదవుల నియామకాలను అధికారికంగా ప్రకటించారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల వైస్ ప్రెసిడెంట్లుగా సుంకరి శ్రీనివాస్, ఉస్కమల్ల రాములు, పాత ప్రశాంత్, జంగిటి రమేష్‌లను నియమించారు. జనరల్ సెక్రటరీలుగా మంతెన లక్ష్మయ్య, వేముల రవీందర్ గౌడ్, చిదిరాల మహిపాల్ రెడ్డి, తుంగపిండి ఆనంద్, దుర్గం లింగయ్యలకు బాధ్యతలు అప్పగించారు. స్పోక్స్ పర్సన్‌గా జలంపెల్లి మల్లేష్‌కు అవకాశం కల్పించారు.సెక్రటరీలుగా ఎండీ జైనుద్దీన్, గుడుగుల దేవేందర్, వడ్లకొండ వెంకటస్వామి గౌడ్, బేముని సంజీవ్, వేముల సతీష్ కుమార్, జోగురు శ్రీనివాస్, జలంపెల్లి మల్లేష్, కొడదర్ సాయి సూర్య, అన్నం వెంకన్న, కామెర సతీష్‌లను ఎంపిక చేశారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా లంబు దేవేందర్ రెడ్డి, తుమ్మల దేవేందర్ రెడ్డి, చిప్పకుర్తి దుర్గయ్య, గుడెల్లి రాజిరెడ్డి, చిప్పకుర్తి రామ్‌చందర్, గొలాడ రమేష్‌లకు చోటు కల్పించారు. మీడియా కమ్యూనికేషన్ బాధ్యతలను పూజారి శేఖర్‌కు అప్పగించగా, సోషల్ మీడియా కమిటీలో కాశిపేట సతీష్, పల్లా నాగేశ్‌లను నియమించారు. కొత్తగా నియమితులైన నాయకులు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## నేరడిగొండ మండలంలో అకాల వర్షం



**నేరడిగొండ, మే 18 (ప్రజాజ్యోతి):**నేరడిగొండ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అకాల వర్షం బీభత్సం సృష్టించింది. హఠాత్తుగా వీచిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా మండలంలోని వాంకిడి, బంధం గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది.ఈదురు గాలుల ధాటికి రహదారుల పక్కన ఉన్న భారీ వృక్షాలు ఒక్కసారిగా రోడ్లపై విరిగిపడ్డాయి. దీంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం తీవ్రతతో పాటు గాలి వేగం ఎక్కువగా ఉండటంతో ఇండ్ల పైన, హోటళ్ల పైన ఉన్న రేకులు గాల్లోకి లేచిపోయాయి.ఒక్కసారిగా మారిన వాతావరణం, గాలుల ఉధృతికి స్థానిక ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణనష్టం తప్పినప్పటికీ, ఆస్తి నష్టం సంభవించడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పడిన చెట్లను తొలగించి, రవాణాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# అలంకార పాయంగా మారిన " తెలంగాణలో ప్రతిష్టాత్మక నిర్మించిన " తెలంగాణ క్రీడా ప్రాంగణాలు" పై " ప్రజా జ్యోతి" లో ప్రత్యేక కథనం

గత ప్రభుత్వం లో లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన తెలంగాణలో ప్రతిష్టాత్మక " తెలంగాణ క్రీడా ప్రాంగణాలు" అలంకార పాయంగా మారాయని విమర్శలు వస్తున్నాయి . గ్రామాల్లో పాడుబడుతున్న క్రీడా మైదానాలతో యువతకు క్రీడా సదుపాయాలు అందని ద్రాక్ష పండు లాగా మారాయి .

తెలంగాణ క్రీడా ప్రాంగణాలు... లక్షల ఖర్చు, ఇప్పుడు గడ్డిపరకలేనా..?

బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం -భారీ ప్రచారం... కాంగ్రెస్ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం..!



**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి నాయకత్వంలోని బీఆర్ఎస్ (టిఆర్ ఎస్) ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా "తెలంగాణ క్రీడా ప్రాంగణాలు" ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీ, మండల కేంద్రాల్లో యువతకు వ్యాయామం, క్రీడల కోసం ప్రత్యేక స్థలాలు ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రాంగణాల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించారు. కానీ నేడు ఆ క్రీడా ప్రాంగణాలు చాలా చోట్ల పాడుబడి గడ్డి మైదానాలుగా మారిపోవడం,అన్యాక్రాంతం కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా ప్రాంగణాల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా, వాటి నిర్వహణపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో క్రీడా పరికరాలు కనిపించకపోవడం, కొన్ని చోట్ల స్థలాలు ఇతర అవసరాలకు వినియోగించడం, మరికొన్ని చోట్ల బోర్డులు తప్ప ఏమీ లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. తెలంగాణ ప్రభుత్వం గ్రామ స్థాయిలో యువతను క్రీడలవైపు ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమంగా ఈ ప్రాంగణాలను ప్రవేశపెట్టి నిర్మాణాలను పూర్తీ చేసింది . ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి అక్కడ వాలీబాల్, కబడ్డీ, కోకో, రన్నింగ్ ట్రాక్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీ నిధులు, ప్రత్యేక గ్రాంట్లు, జిల్లా స్థాయి క్రీడా నిధుల ద్వారా ఒక్కో ప్రాంగణానికి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయం చేసినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు . కొన్ని పెద్ద గ్రామాలు, మండల కేంద్రాల్లో అయితే రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు కూడా ఖర్చు చేసినట్లు సమాచారం. స్థల సమతలీకరణకు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష, ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షలు, వాలీబాల్ కోర్టులకు రూ.40 వేల వరకు, కబడ్డీ, కోకో మైదానాల గుర్తింపుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు, ఓపెన్ జిమ్ లేదా వ్యాయామ పరికరాలకు రూ.1 లక్ష వరకు, బెంచీలు, బోర్డులు, లైటింగ్‌కు మరో రూ.50 వేల వరకు ఖర్చు చేసినట్లు అంచనాలు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కో క్రీడా ప్రాంగణానికి కనీసం రూ.4 లక్షల వరకు ప్రజాధనం వెచ్చించినట్లు తెలుస్తోంది. అయితే చాలా గ్రామాల్లో పూర్తి స్థాయి పనులు జరగకపోయినా బిల్లులు పూర్తిగా క్లియర్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కేవలం జేసీబీతో స్థలం సర్దిచేసి బోర్డు ఏర్పాటు చేసి పనులు పూర్తయ్యా యని చూపించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఫెన్సింగ్ లేకుండానే బిల్లులు డ్రా చేశారని, పరికరాలు ఎక్కడికో మాయమయ్యాయని, క్రీడా సామగ్రి కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని విమర్శలు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ..................**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కూడా పెద్ద ఎత్తున ఈ తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడా




ప్రాంగణాల కోసం స్థలాలు గుర్తించి పనులు చేపట్టినట్లు అప్పటి అధికారులు తెలిపారు .. జిల్లాలోని చెన్నూర్, జైపూర్, లక్సెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లి, హాజీపూర్, దండేపల్లి, నెన్నెల తదితర మండలాల్లో ఈ ప్రాంగణాల ఏర్పాటు జరిగినట్లు సమాచారం. జిల్లాలో వందల సంఖ్యలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు అధికారిక అంచనాలు చెబుతున్నాయి. ఒక్కో ప్రాంగణానికి కనీసం రూ.4 లక్షలు లెక్కించినా మంచిర్యాల జిల్లాలోనే కొన్ని లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చైనట్లు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం చాలా ప్రాంగణాల్లో గడ్డి పెరిగి పోవడం, క్రీడా పరికరాలు మాయమవడం, పశువుల మేత స్థలాలుగా మారడం, చెత్త నిల్వ కేంద్రాలుగా ఉపయోగించడం, కొన్ని చోట్ల ఆక్రమణలు మొదలవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానిక యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాల్లో యువత క్రీడల కోసం మళ్లీ ఖాళీ స్థలాలకే పరిమితమవుతున్న పరిస్థితి నెలకొంది.

బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను రాజకీయ ప్రచార వేదికగా వినియోగించు కుందని ప్రతిపక్షాలు అప్పట్లోనే విమర్శించాయి. గ్రామాల్లో యువత కోసం కంటే పార్టీ ప్రచారం కోసమే ఈ కార్యక్రమం చేపట్టారని ఆరోపించాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాంగణాల పునరుద్ధరణపై దృష్టి పెట్టకపోవడం మరో చర్చకు దారి తీస్తోంది.

**యువత ,క్రీడాకారులు, ప్రజలు కోరుతున్న పరిష్కారాలు.............**

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని,ప్రతి గ్రామంలో భౌతిక పరిశీలన నిర్వహించి నివేదిక విడుదల చేయాలని, దుర్వినియోగం జరిగిన నిధులను తిరిగి రికవరీ చేయాలని, పాడుబడిన క్రీడా ప్రాంగణాలను పునరుద్ధరించాలని, యువత కోసం జిల్లా, మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాలని, ప్రతి ప్రాంగణానికి నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయాలని, సి సి టి వి , లైటింగ్, క్రీడా పరికరాలతో మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు

**ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదు......**

ప్రస్తుతం రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి పేరుతో కొత్త ప్రణాళికలు ప్రకటిస్తున్న ప్రభుత్వం, ఇప్పటికే కోట్ల రూపాయలతో నిర్మించిన " తెలంగాణ క్రీడా ప్రాంగణాల" పరిస్థితిపై సమీక్ష ఎందుకు చేయడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రామీణ యువతకు ఉపయోగపడేలా వాటిని పునరుద్ధరించి, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి, యువతను మళ్లీ క్రీడలవైపు మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం గత ప్రభుత్వ పథకాలపై ప్రస్తుత ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. ఒక ప్రభుత్వం ప్రారంభించిన పథకాన్ని మరో ప్రభుత్వం కొనసాగించకపోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు .

## న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టిన జైపూర్ వీవోఏలు



**జైపూర్, మే 18 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న మొత్తం 31 మంది వీవోఏలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టారు. సోమవారం జైపూర్ ఏపీఎం సీహెచ్ సంతోష్‌కు వినతిపత్రం అందజేసి, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఈ నెల 18వ తేదీన శాంతియుత సమ్మె, ధర్నా కార్యక్రమం నిర్వహించ నున్నట్లు వారు తెలిపారు. వీవోఏలు ప్రస్తుతం అనేక ఇబ్బందుల ను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా తగిన గౌరవ వేతనం లేకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, విధుల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు అందకపోవడం వంటి సమస్యలు తీవ్రం గా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు.తమ సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుత ఆందోళన చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ సందర్భంగా వీవోఏలు ప్రధానంగా పలు డిమాండ్లు వినిపించారు. నెలకు రూ.26 వేల గౌరవ వేతనం వెంటనే అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ తీసుకురావాలని, శాఖాపరమైన అన్ని హక్కులు కల్పించాలని కోరారు. అలాగే ఔట్‌సోర్సింగ్ వీవోఏల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని, విధుల నిర్వహణకు అవసరమైన ట్యాబ్ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సెర్ప్ ప్రతినిధులతో చర్చలు జరిపి తమ సమస్యలకు న్యాయమైన పరిష్కారం చూపాలని వీవోఏలు ప్రభుత్వాన్ని కోరారు.

## యోగ తోనే సంపూర్ణ ఆరోగ్యం సర్పంచ్ అక్షర అనీల్



**దిలావర్ పూర్ , మే 18 ,( ప్రజాజ్యోతి ).** దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ప్రజాపాలన-ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగం గా ఫిట్ మరియు యాక్టివ్ తెలంగాణ కింద యోగా మరియు మారథాన్ రన్ నిర్వహించడం జరిగింది ఆరోగ్య స్పృహను పెంపొందించడానికి యోగా మరియు మారథాన్ రన్ రెండూ అద్భుతమైన మార్గాలని అన్నారు . క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మారథాన్ రన్నర్లకు కండరాల దృఢత్వం తగ్గి, శ్వాస నియంత్రణ, మరియు గాయాలయ్యే ప్రమాదం తగ్గుతుం ది. యోగా మరియు మారథాన్ రన్‌ను ఒకే ఈవెంట్‌గా నిర్వహిం చాలని ప్లాన్ చేస్తుంటే, కొన్ని ముఖ్యమైన విషయాలను దృష్టిలో ఉంచుకోవడం అవసరం మని తెలిపారు,ఉదయం పూట వాతావ రణం అనుకూలంగా ఉన్న సమయంలో (సూర్యోదయాని కి ముందు) 'యోగా సెషన్' నిర్వహించి, ఆ తర్వాత మారథాన్ రన్ ప్రారంభించడం మంచిదన్నారు.వార్మ్-అప్: మారథాన్‌కు ముందు శరీరాన్ని సిద్ధం చేయడానికి 10-15 నిమిషాల పాటు బ్రీతింగ్, స్ట్రెచింగ్ యోగా చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపివో, గోవర్ధన్. ఏవో, రాజశేఖర్. పంచాయతీ సెక్రటరీ మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానం దం తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ సందర్భంగా ముస్లిం, హిందూ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం

## గోవధ నిషేధం కఠినంగా అమలు చేస్తాం

## బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సమీక్ష





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 18 ,( ప్రజాజ్యోతి )** ఈనెల 27న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, గోవధ నిషేధ చట్టం అమలు, సామాజిక సామరస్యాన్ని కాపాడే అంశాలపై ఈరోజు నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఐఏఎస్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, హిందూ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలు, పశువుల రవాణా నియంత్రణ, చట్ట అమలు అంశాలపై జిల్లా చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ తెలంగాణ గోవధ నిషేధ చట్టం -- 1977 ప్రకారం ఆవుల వధ పూర్తిగా నిషేధించబడిందని, రాష్ట్రవ్యాప్తంగా ఆవుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్ విధానం అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఏ పశువుల మార్కెట్ (షండీ) నుండి అయినా ఆవుల రవాణా విషయంలో కఠిన నిఘా కొనసాగుతుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 14 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి,విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. అలాగే జిల్లాలోని టోల్ గేట్ల వద్ద పటిష్ట మైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు బక్రీద్‌కు ముందు 10 రోజుల పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో తప్పనిసరిగా ఒక ఇన్‌స్పెక్టర్/ఎస్‌హెచ్‌వో లేదా అదనపు ఎస్‌హెచ్‌వో తగిన బలగాలతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే స్పందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడిందని, అనుమానాస్పద పశువుల రవాణా వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టుల వద్ద అన్ని వాహనాలపై సమగ్ర ధృవీకరణ నిర్వహించాలని, ముఖ్యంగా ఆవులు లేదా దూడలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు.వాహనాల్లో జంతువుల రవాణా సమయంలో పరిమితికి మించి లోడ్ చేస్తే, అదనపు జంతువులను తరలించేందుకు వేరే వాహనం ఏర్పాటు చేసి, సంబంధిత ధృవీకరణ పత్రాలు పొందాలని సూచించారు. పశువుల రవాణా, జంతు సంక్షేమ నిబంధనలు, వాహనాల పరిమాణ ప్రమాణాలు తదితర అంశాలపై రూపొందించిన ప్రజెంటేషన్‌ను అందరు ఎస్.హెచ్.ఓ లు తెలుసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. తక్కువ సమయంలో పశువుల షెల్టర్లు అందుబాటులోకి రావడం కష్టమవుతుందని భావించి, అవసరమైతే ప్రభుత్వ భూముల్లో తాత్కాలిక పశువుల షెల్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లాలో కనీసం ఒక పశువుల దొడ్డి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బక్రీద్ సందర్భంగా జంతు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, దేవాలయాల సమీపంలో లేదా ఇతర సున్నిత ప్రాంతాల్లో జంతువులు చెల్లాచెదురు చేయకుండా జేసీబీల సహాయంతో లోతుగా పూడ్చిపెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.ఇప్పటికే జిల్లా పోలీసు అధికారులు స్థానిక మత పెద్దలు, ప్రజాప్రతినిధులతో సమావేశమై శాంతి భద్రతల పరిరక్షణపై చర్చించినట్లు తెలిపారు. సమస్యలు సృష్టించే అవకాశమున్న వ్యక్తులను గుర్తించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతోందన్నారు. అవసరమైతే బైండ్ ఓవర్ చర్యలు కూడా తీసుకుంటున్నామని తెలిపారు.రాత్రి వేళల్లో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక రిజర్వ్ ఫోర్స్‌తో పాటు ఒక ఆర్ఐని 15 రోజుల పాటు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలతో సమన్వయం కొరకు ఒక అధికారిని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.బక్రీద్ పండుగ అనంతరం కూడా మరో రెండు మూడు రోజుల పాటు చెక్‌పోస్టులు కొనసాగుతాయని, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటారని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు.ప్రజలు ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే డయల్ 100 నెంబర్ కి లేదా పోలీసులకు సమాచారం అందించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ సూచించారు. ఈ శాంతి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఐఏఎస్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ తో పాటు అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ లు అప్పాల గణేష్ చక్రవర్తి, బిబి కుతిజ సిద్ధికి, ఇతర అధికారులు, సిబ్బంది, హిందూ మత పెద్దలు,ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కౌట్ల బి లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన పిఏసీఎస్ చైర్మన్



**సారంగాపూర్, మే 18,ప్రజా జ్యోతి** మండలంలోని కౌట్ల(బి) గ్రామం లో సోమవారం డిసీఎంఎస్ ఆధ్వర్యంలో కౌట్ల పి ఏసిఎస్ చైర్మన్ అయిర నారాయణ రెడ్డి, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించరు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు అమ్మకూడదని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్ లలో వరి ధాన్యన్ని అమ్ముకోవాలని తెలిపారు . ఏ గ్రేడ్ క్వింటాల్ ధర 2389 రూపాయలకు కామన్ గ్రేడ్ క్వింటాల్ ధర 2369, రూపాయలకు రైతులుమద్దతుగా ధర ఉంది అని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వరికి 500 రూపాయల బోనస్ ఇస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బల్గురి అజయ్ ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి,మాక్స్ చైర్మన్ భూమారెడ్డి డైరెక్టర్లు పోతరెడ్డి, భోజన్న మ్యాక్స్ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గోవధ నిషేధం కఠినంగా అమలు చేయాలి

### సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

### నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరిక




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 18 ,( ప్రజాజ్యోతి ).** గోవధ నిషేధానికి నిర్మల్ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, దాని కొరకు 24/7 జిల్లా వ్యాప్తంగా 14 చెక్ పోస్టులను నడపడం జరుగుతుందని తెలియ జేశారు.సోషల్ మీడియాలో నిర్ధారణ లేకుండా అసత్య ప్రచారాలు చేయడం, ప్రజల్లో అపోహలు సృష్టించడం చట్ట విరుద్ధమని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఎద్దులను , గోవులు అని తప్పుడు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నారు. దీని వలన చాలా అలజడి నెలకొంటుంది.ఇలాంటి అసత్య ప్రచారాల వల్ల సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఎక్కడైనా గోవుల అక్రమ రవాణా జరుగుతోందని అనుమానం కలిగితే లేదా ఆవులు తరలిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 కు సమాచారం అందించాలని, పోలీసులు వెంటనే స్పందిస్తారని తెలియ జేశారు.గోవులను సంరక్షించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు అని, అదే సమయంలో అసత్య ప్రచారాలు చేసే సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు.

## కుంటాల పీహెచ్‌సీ లో ఆరోగ్య అవగాహన సదస్సు



**నేరడిగొండ, మే 18 (ప్రజా జ్యోతి)** నేరడిగొండ మండల పరిధిలోని కుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సోమవారం (డాజుగా ) కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్ఈఓ పవార్ రవీందర్, ఎస్సీఆర్పీ ప్రకాష్ సర్ హాజరై, స్థానిక ప్రజలకు ఆరోగ్య రక్షణ మరియు తదితర అంశాలపై కీలక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ, ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త చౌహాన్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త రుక్మాబాయి, స్థానిక వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 18 ,( ప్రజాజ్యోతి ).** జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం తరలింపు ప్రక్రియ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సోమవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పంటల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏ కొనుగోలు కేంద్రంలో కూడా తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండకూడదన్నారు. అలాగే తేమ శాతానికి వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేయాలన్నారు. అవసరం అయితే సరిహద్దు జిల్లాల నుంచి అదనంగా లారీలు, హమాలీలను సమకూర్చుకోవాలని చెప్పారు.




ఇంకనూ ఎక్కడైనా ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు అన్వేషించాలని వివరించారు. ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యం తరలింపు ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు

ఉమ్మడి ఆదిలాబాద్ మైనారి టీల సమస్యలపై ఉన్నత స్థాయి సమీక్ష






**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రణాళికలు రూపొందించుకొని, పకడ్బందీ గా అమలు చేయాలనీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలోని మై నారిటీల సమస్యలు, విద్యా సంస్థల బలోపేతం, మౌలిక వసతుల కల్పన పై ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల విడు దలైన 10వ తరగతి, ఇంటర్మీ డియట్ ఫలితాలతో పాటు, ప్రధానమంత్రి జన్ వికాస్ కా ర్యక్రమం కింద జిల్లాకు మం జూరైన మూడు టెమ్రీస్ పాఠ శాలల భవనాల ప్రా రంభోత్సవాలు, నియాజక వర్గాల వారీగా సమస్యలపై మంత్రి సమీ క్షించారు. ప్రత్యేక మైనారిటీ డిగ్రీ కాలేజ్, ఖబ్రస్తాన్‌లకు కాం పౌండ్ వాల్స్, నీరు, లైటింగ్ వసతులు, యువత కోసం స్కి ల్ డెవలప్‌మెంట్ సెంటర్, బోథ్ నియోజకవర్గ పరిధిలోని బోథ్, నెరడిగొండ, ఇచ్చోడ షాదీ ఖానా పనులకు నిధుల విడుదల, పేద వితంతువులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పై సుదీర్ఘంగా చర్చించి, నివేది కలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, టెమ్రీస్ సెక్రటరీ ఫహీమ్ ఖురేషి, సెక్రటరీ షఫీయుల్లా, మైనారిటి సంక్షేమ అధికారి కలీం, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పునరుత్పాదక ఇంధన వనరుల విని యోగాన్ని పెంచాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సోలార్ పవర్ షాప్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)**పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పునరు త్పాదక ఇంధన వనరుల విని యోగాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం జి ల్లా కేంద్రంలోని రాంనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'సోలార్ పవర్ షాప్'ను ఆయ న ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం పెరు గుతున్న విద్యుత్ డిమాండ్‌కు కాలుష్య నివారణకు ప్రత్యా మ్నాయంగా సౌరశక్తి ఎంత గానో ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రజలు తమ ఇండ్ల పై, వ్యాపార సముదాయాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించు కోవ చ్చని, అలాగే పర్యావరణానికి మేలు చేసిన వారవుతారని పిలు పునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి అధునాతన సోలార్ పరికరాల దుకాణం అందుబాటులోకి రావడం అభినందనీయమని, ప్రజలకు సౌర శక్తిపై మరింత అవగాహన కల్పించేలా నిర్వాహకులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యజమానులు జలీల్, వ్యాపార స్తులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల కమిటీల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



**మంచిర్యాల, 18,మే (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ పార్టీ మరియు అనుబంధ సంఘాల పూర్తి స్థాయి కమిటీల ఏర్పాటుకు సంబం ధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం మంచి ర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం లో ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నూర్ పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీలతో పాటు సోషల్ మీడియా, మహిళా కమిటీ, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనార్టీ సెల్, మీడియా అండ్ కమ్యూనికేషన్ సెల్, సేవాదళ్ కమిటీల నియామకాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మండల అధ్యక్షుడు ముత్యాల బాప గౌడ్, మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ పుల్లూరి లక్ష్మణ్, చెన్నూర్ బ్లాక్ ఇంఛార్జ్, మంచిర్యాల జిల్లా సెక్రటరీ కొండు వెంకటేష్, చెన్నూర్ మండల ఇంఛార్జ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చెన్నూర్ పట్టణ, మండల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

"జన్ భాగిదారి - సబ్సే దూర్, సబ్సే పహలే" కార్యక్రమాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్లు



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** ప్రజావాణి అర్జీల పరిష్కారాని కి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కల్లెక్టర్లు ఆర్. ఎస్. చిత్రు, రాజేశ్వర్ అన్నారు. సో మవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్ర జావాణి కార్యక్రమంలో భాగం గా వివిధ ప్రాంతాల నుండి వ చ్చిన ప్రజల అర్జీలను వారు స్వీకరించి, పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆ దేశించారు. అంతకుముందు "జన్ భాగిదారి - సబ్సే దూర్, సబ్సే పహలే" (పిఎం జన్మాన్ డిఎ-జెజియుఎ) కార్యక్రమా న్ని అదనపు కలెక్టర్లు ప్రారం భించారు. గిరిజన ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వ హించాలనే ఉద్దేశంతో రూపొందించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం నేటితో ప్రారంభమై 25 మే, 2026 వరకు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. అంతకు ముందు కార్యక్రమం ప్రారంభో త్సవం సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి అదన పు కలెక్టర్లు, అధికారులు పూ లమాలలు వేసి ఘనంగా ని వాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో డిఆర్ఓ స్ర వంతి, డిఆర్డీఓ రవీందర్, ఏటిడివో నిహారిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

## జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వండి.. మా కుటుంబాలను ఆదుకోండి!

సింగరేణి అన్ ఫిట్ కార్మికుల వారసుల ఆందోళన


జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వండి!
మా కుటుంబాలను ఆదుకోండి!
సింగరేణి అన్ ఫిట్ కార్మికుల కుటుంబాల ఆందోళన

**మంచిర్యాల, 18,మే ( ప్రజా జ్యోతి ):**సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా అన్ ఫిట్‌గా ప్రకటించబడిన కార్మికుల వారసులకు ఇవ్వాల్సిన ఉద్యోగ నియామక ప్రక్రియ గత కొన్ని నెలల నుంచి ఆలస్యం కావడంతో అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పలుమార్లు యాజమాన్యానికి వినతి పత్రాలు అందజేసినా, గుర్తింపు కార్మిక సంఘాల నాయకులను కలిసినా, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేసినా ఇప్పటివరకు సరైన స్పందన లేకపోవడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మెడికల్ అన్ఫిట్ అయిన కార్మికుల కుటుంబాలు ఉద్యోగాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, ఉద్యోగ నియామక లెటర్లు ఇవ్వకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులు అన్ని అర్హతలు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంపై సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామక లెటర్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను,సింగరేణి యాజమాన్యాన్ని ప్రభుత్వాన్ని, అభ్యర్థులు కోరుతున్నారు. కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు మీడియా ద్వారా తమ గోడును వెల్లబుచ్చుకుంటూ త్వరితగతిన నియామక ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైతు బీమా కి తగిన పత్రాల సేకరణ



**లక్ష్మణ చాంద, 18 (ప్రజా జ్యోతి)** మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన చిట్యాల చిన్న ముత్తన్న రైతు ఇటీవల అనారోగ్యంతో మరణించడం తో ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా పథకం కు అర్హుడుగా ఉన్నందువలన సోమవారం రోజున వారి కుటుంబానికి వ్యవసాయ విస్తరణ అధికారి పవిత్ర వెళ్లి రైతు బీమాకి సంబంధించిన పత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ అయిట్ల లక్ష్మీ సుదర్శన్, ఉప సర్పంచ్ గంగారెడ్డి, సురేష తదితరులు ఉన్నారు.

# ఎవరైనా సరే, బండి సంజయ్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే యుద్ధం చేస్తా

సొంత పార్టీ వారైనా సరే బీజేపీ ని కించపరిచేలా మాట్లాడితే ఉపేక్షించేదిలేదు.

నాయకుడి కొరకు బీజేపీ ని బంధనం చేస్తే ఊరుకోం .

సిద్ధాంతం కోసం,నమ్మిన ధర్మం కోసం పని చేసే కార్యకర్తల పైన మీ పెత్తనాలను మేం సహించం.



**మామడ మే 19 ( ప్రజా జ్యోతి)** ఇటీవలే బండి సంజయ్ కొడుకు పై జరుగుతున్న పో క్సోకేసు వైఖరి పై ఇతర పార్టీలకు చెందిన నేతలకు బిజెపిపై పిచ్చి కూతలు కూసే వారు ఎవరైనా సరే పద్ధతి దాటితే యుద్ధమే అంటున్న సీనియర్ బీజేపీ యువ నాయకుడు ఎలిగేటి వంశీకృష్ణ నేత.

**రండి .... బండి సంజయ్ గురించి మీకు వివరిస్తాను ...! ఎలిగేటి వంశీ కృష్ణ నేత :**

బండి సంజయ్ సామాన్యుడి నుంచి పార్టీ చీఫ్‌గా.. ఎలా సాధ్యమైంది? నలభై ఏడేళ్ల ఓ సామాన్యుడు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా రాజకీయాల్లో ఎదిగాడు. కార్పొరేటర్ స్థాయి నుంచి ఎంపీ స్థాయికి చేరుకున్నాడు. ఇప్పుడు ఏకంగా జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యాడు. అనేక మంది సీనియర్లను తోసిరాజని ఆ పదవి దక్కించుకున్నాడు. ఆయనే బండి సంజయ్ కుమార్.. ఆయన పేరును ప్రకటించే వరకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను నియమిస్తారని ఎవరూ ఊహించ లేదు. లక్ష్మణ్, మురళీధర్ రావు, విద్యాసాగర్ రావు లాంటి నాయకు లు జాబితాలో ఉన్నా.. ధర్మపురి అరవింద్, డీకే అరుణ లాంటి నేతలు లాబీయింగ్ చేసినా బండి సంజయ్‌నే కీలక పదవి వరించిం ది. ఇది ఎలా సాధ్యమైంది? బండి సంజయ్ ప్రత్యేకతలేంటి?

**ఆయన జీవితం గురించి ఆసక్తికర వివరాలు...**

**స్వయం సేవక్ అనుభవం, కలుపుగోలుతనం...**

చిన్ననాటి నుంచి స్వయం సేవక్‌గా అలవాటైన క్రమశిక్షణ.. హిందూ ధర్మంపై విశ్వాసం.. విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్ర.. కరీంనగర్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా, మున్సిపల్ కార్పొరేటర్‌గా అందించిన సేవలు.. అవినీతికి దూరంగా ఉండటం.. రాజకీయంగా విమర్శలు చేయడమే తప్ప అన్ని పార్టీల వారితోనూ వ్యక్తిగతంగా కలుపుగోలుగా ఉండటం.. స్థూలంగా బండి సంజయ్ ప్రస్థానమిది. ఉమ్మడి కుటుంబం తనకు మరింత బలాన్నిచ్చిందని ఆయన గర్వంగా చెబుతారు. గతంలో 'సాక్షి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తన రాజకీయ జీవితానికి సంబంధించి ఆసక్తికర వివరాలు వెల్లడించారు.

**సామాన్య మధ్య తరగతి కుటుంబం నుంచి..**

బండి సంజయ్ కుమార్‌ది సామాన్య మధ్య తరగతి కుటుంబం. ఆయన తండ్రి బండి నర్సయ్య ప్రభుత్వ టీచర్‌గా పనిచేసేవారు. అయితే.. ఎక్కువ కాలం డిప్యుటేషన్ మీద జిల్లా పరిషత్‌లో విధులు నిర్వర్తించారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేసేవారు. 25 ఏళ్ల కిందట ప్రమాదవశాత్తూ ఇంటిపైన ట్యాంక్ కూలి ఆయన మరణించారు. అమ్మ శకుంతల గృహిణి. బండి సంజయ్ తల్లిదండ్రులకు నలుగురు సంతానం. ఇద్దరు అన్నలు, ఒక అక్క తర్వాత ఇంట్లో అందరికంటే చిన్నవాడు ఆయనే. బండి సంజయ్ కుటుంబం ఎక్కువ కాలం కరీంనగర్ కాపువాడలో నివసించేది. ఆ తర్వాత జ్యోతినగర్‌కు షిఫ్ట్ అయ్యారు. బండి సంజయ్ భార్య అపర్ణ ఎస్‌బీఐ ఉద్యోగినిగా పనిచేస్తున్నారు.

**అద్వానీ రథయాత్రలో ఇంఛార్జ్‌గా...**

1996లో బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ సూరాజ్ రథయాత్ర చేపట్టారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలను చుట్టివచ్చిన ఆయన.. కరీంనగర్ యాత్రకు వచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ వేకువజామునే చౌరస్తాలో జెండాలు కడుతుంటే నాటి మెట్‌పల్లి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చూసి చలించిపోయారు. మరుసటి రోజు రథయాత్ర సందర్భంగా జరిగిన సభలో అద్వానీకి గంట గంటకు టీ ఇప్పించే పని అప్పగించారు. తర్వాత వెంకయ్యనాయుడు ద్వారా సిఫార్సు చేసి ఆయన్ని అద్వానీ రథయాత్ర వాహన శ్రేణికి ఇన్‌చార్జిగా నియమించారు. ఇది బండి సంజయ్ జీవితాన్ని పూర్తిగా మలుపుతిప్పింది.

**మలుపు తిప్పిన ఢిల్లీ లైఫ్..**

బండి సంజయ్ తల్లిదండ్రులు కరీంనగర్ కాపువాడలో ఉన్నప్పుడు ఆయన్ని ఒకటో తరగతిలో సరస్వతి శిశు మందిర్‌లో చేర్పించారు. శిశుమందిర్ నుంచే ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఏర్పడింది. రోజూ శాఖకు వెళ్లేవారు. ఆర్ఎస్ఎస్‌లో ఘటన్ నాయక్‌గా, ముఖ్య శిక్షక్‌గా ప్రాథమిక విద్యా స్థాయిలోనే పనిచేశారు. సరస్వతి శిశుమందిర్ ద్వారా తనకు విద్యతో పాటు క్రమశిక్షణ అలవడిందని ఆయన చెబుతారు. తనకు నాయకత్వ లక్షణాలను ఆర్ఎస్ఎస్ నేర్పిందని.. ఇప్పటికీ స్వయక్ సేవక్‌ని అని చెప్పుకోవడానికి గర్వపడతానని బండి సంజయ్ ఓ సందర్భంలో చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో అద్వానీ రథయాత్ర నిలిచిపోవడంతో బండి సంజయ్‌ను ఢిల్లీ సెంట్రల్ ఆఫీస్‌లో సహాయక్‌గా పంపించారు. ఇది మరో మలుపు తిప్పింది. సెంట్రల్ ఆఫీసులో ఉండి అద్వానీకి,వెంకయ్యనాయుడుకు సేవలు చేశారు. ఈ సమయంలో వారి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నానని బండి సంజయ్ చెబుతారు.

**బొట్టు తెచ్చిన తిప్పలు.. అయినా ఇప్పటికీ అదే ప్రత్యేకత**

హిందూ ధర్మాన్ని అనుసరించే బండి సంజయ్‌కి.. చిన్ననాటి నుంచే తన నుదిటిపై కుంకుమ బొట్టును ధరించడం అలవాటు. అలా బొట్టు పెట్టుకోవడం వల్ల కొన్ని విద్యా సంస్థల్లో అనుమతి నిరాకరించారని ఆయన చెప్పారు. అలాగని.. తన పద్ధతి మార్చుకోలేదని ఆయన గర్వంగా చెబుతారు. రెండుసార్లు కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన బండి సంజయ్.. భారీ మెజారిటీతో కరీంనగర్ ఎంపీగా గెలవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. నిత్యం ప్రజలతో మమేకమవడం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే తన విజయానికి కారణమని ఆయన చెబుతారు.

**టీఆర్ఎస్ సీనియర్ నేతపై భారీ మెజార్టీతో విజయం**

1994లో 23 ఏళ్ల ప్రాయంలోనే బండి సంజయ్.. కరీంనగర్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా పోటీ చేసి విజయం సాధించారు. 2000 సంవత్సరంలో మారోసారి బ్యాంకు డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. 2005లో బీజేపీ నుంచి తొలిసారిగా కౌన్సిలర్‌గా గెలిచారు. 2010లో 48వ డివిజన్‌కు మరోసారి కార్పొరేటర్‌గా భారీ మెజారిటీతో గెలిచారు. 2014, 2018లలో కరీంనగర్ స్థానం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి.. టీఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ కుమార్‌పై గెలుపొం దారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి గెలిచిన ఎంపీలందరికంటే ఎక్కువ మెజారిటీతో ఆయన గెలుపొందడం విశేషం.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, 18,మే ( ప్రజా జ్యోతి ):** బాధితులు ఇచ్చే ఫిర్యాదుల పై తక్షణమే స్పందించి, సత్వర న్యాయం జరుగు తుందనే నమ్మకం కల్పించా లని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు.పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి అధికారులు మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది నుండి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ రిసెప్షన్, సీసీటీఎన్ఎస్ సిబ్బంది మరియు ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, రౌడీషీటర్లు, అనుమానితుల వివరాలు మరియు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది సమస్యల ను కూడా సీపీ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి కానిస్టేబుల్‌కు కేటాయించిన కాలనీలు, గ్రామాలను సందర్శించి ప్రజలు, యువతతో మాట్లాడి శాంతిభద్రతలకు సంబంధించి న సమస్యలను తెలుసుకో వాలని తెలిపారు.ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. కళాశాలలు, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సీపీ అధికారులు, సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, బెల్లంపల్లి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'

## టూరిజం కోర్సుల పోస్టర్లు ఆవిష్కరణ, విద్యార్థులకు పోటీలు







**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** జిల్లాలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యా టక శాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇం దులో భాగంగా సోమవారం కలెక్టరేట్ లోని విసి హాల్ లో యువ టూరిజం క్లబ్స్, హెరిటే జ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధిం చిన ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సు ల పోస్టర్లను అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరిం చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో మైనారిటీ సంక్షేమ అధికారి కలీం, జిల్లా పర్యాటక శాఖ అధికారి రవి కుమార్, భూభారతి కోఆర్డినేటర్ స్వాగత్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రజాపాల న-ప్ర గతి ప్రణాళికలో భాగంగా బిసి స్టడీ సర్కిల్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలె క్టర్ రాజేశ్వర్ పాల్గొని మాట్లా డుతూ ఆదిలాబాద్ జిల్లా ప ర్యాటక రంగానికి ఎంతో అను వైన ప్రాంతమని, స్థానిక పర్యా టక ప్రదేశాల ప్రాధాన్యతను వి ద్యార్థులందరూ తప్పక తెలు సుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన జ లపాతాలు, ప్రాచీన దేవాల యాలు ఉన్నాయని కొని యా డారు. ఈ రోజు జిల్లా కేంద్రం లోని బీసీ స్టడీ సర్కిల్ లైబ్రరీ, స్టడీ హాల్ విద్యార్థులకు 'జిల్లా టూరిజం' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించడం జరిగిందని, దాదాపు 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.అనంతరం వ్యాసరచ న పోటీ విభాగంలో పోశెట్టి ప్ర థమ, హీరామణి ద్వితీయ, వ రుణ్ తృతీయ బహుమత లు, అలాగే ఉపన్యాస పోటీల లో హీరామణి ప్రథమ, ప్రి యాంక ద్వితీయ, ప్రనుష తృతీయ బహుమతులగా భారత రాజ్యాంగం, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీఎస్సీకి సంబంధించిన విలువైన పుస్త కాలను అదనపు కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సోనియా, జిల్లా టూరిజం శాఖ అధికారి రవికుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరె క్టర్ రమేష్, విద్యార్థులు, పా ల్గొన్నారు.

## ఖిరిడిలో మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహ ఆవిష్కరణ



**కొమరం భీం జిల్లా ప్రతినిధి ( వాంకిడి ) మే 18 ప్రజా జ్యోతి** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండల ఖిరిడి గ్రామంలో మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహాన్ని మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలను చేతబూని గ్రామ వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి గ్రామ ప్రజలు, మాలి సంఘం సభ్యులు పెద్దఎత్తున పాల్గొని నినాదాలు చేశారు ర్యాలీ అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు, గ్రామస్తులు అన్నదానంలో పాల్గొన్నారు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు సరస్వతి కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సమాన త్వం విద్యా ప్రాముఖ్యత కోసం జ్యోతిబా పూలే సావిత్రిబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు

## రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** జిల్లాలో రెడ్ క్రాస్ సేవా కార్యక్ర మాలను మరింత విస్తృతం పరిచేందుకు, ప్రతి ఒక్కరూ భాగస్వాములై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలు పునిచ్చారు. సోమవారం స్థానిక పెన్ గంగా భవన్‌లో ప్రత్యేక రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మానవతాదృ క్పథంతో సేవలందించే రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది చొరవ చూపి రెడ్ క్రాస్ సభ్య త్వాలను నమోదు చేసుకోవాలని, నెలరోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని సమన్వ యంతో విజయవంతం చేయాలని రెడ్ క్రాస్ సొ సైటీ సభ్యులకు సూచించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ సా మాజిక బాధ్యతగా భావించి, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెడ్ క్రాస్ సభ్యత్వం స్వీకరించి సేవా కార్యక్రమాల్లో భా గస్వామ్యం కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గంగేశ్వర్, స్టేట్ ఎంసీ మెంబర్ విజయ్ బాబు, సభ్యులు సామల ప్రశాంత్, సామ రూపేష్ రెడ్డి, కిషన్ రావు, వెంకటస్వామి, వెంకట్ రెడ్డి, సంతోష్, పలువురు రెడ్ క్రాస్ ప్రతినిధులు, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్దే లక్ష్యం






## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** జిల్లాలో గిరిజన ప్రాంతాల అభ్యున్నతి కోసం వివిధ అభివృ ద్ధి ప్రాజెక్టులు చేపట్టనున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అ న్నారు. సోమవారం నీతి ఆ యోగ్ సీఈఓ అధ్యక్షతన, సం బంధిత అదనపు కార్యదర్శు లతో కలిసి నిర్వహించిన 49 వ ఈసీ సమావేశంలో ఆయన కలెక్టరేట్ లోని ఎన్ఐసి విసిహాల్ నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆదిలాబాద్ జిల్లా పరిపాలన విభాగం సమర్పించిన రూ.5.79 కోట్ల విలువైన ప్రాజెక్టులపై సమీ క్షించారు.ఈ సందర్భంగా కలె క్టర్ సమగ్ర నివేదికను వివరి స్తూ, జిల్లాలో గిరిజన ప్రాంతాల అభ్యున్నతి కోసం వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టను న్నామని తెలిపారు. అందులో భాగంగా నార్నూర్ బ్లాక్‌లో శా స్త్రీయ పద్ధతులు, మార్కెట్ లింకేజీల ద్వారా ల్యాక్ (లక్క) సాగును ప్రోత్సహించడానికి ?40 లక్షల వ్యయంతో ప్రతి పాదనలు సిద్ధం చేసినట్లు తె లిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 12 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైందని, ప్రస్తుతం మరో 8 గ్రామాలకు విస్తరించి మొత్తం 20 గ్రామా ల్లో దీనిని అమలు చేయనున్న ట్లు వివరించారు. ఈ ల్యాక్ సాగు ద్వారా సుమారు 370 గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూరడమే కాకుండా, ఏడాది కి ?15 లక్షల పెట్టుబడితో దాదాపు ?21 లక్షల ఆదాయం లభిస్తుందని వివరించారు. గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేష న్ ద్వారా దీనికి మార్కెట్ స దుపాయం కల్పిస్తున్నామని, రైతులకు అవసరమైన సాంకే తిక శిక్షణను ఫారెస్ట్ డి పార్ట్ మెంట్, సాంకేతిక శిక్షణ సంస్థ ల సహకారంతో అందిస్తున్న ట్లు తెలిపారు. జిల్లాలో వాతా వరణ మార్పులను తట్టుకు నేలా ఉపాధి అవకాశాలను మె రుగుపరచడానికి ?3.8 కోట్ల వ్యయంతో 'వాడీ సాగు, సమ గ్ర వ్యవసాయ ప్రాజెక్టు' క్రింద బోర్ వెల్స్ రీఛార్జ్ నిర్మాణాలు, ఫార్మ్ పాండ్స్, తోటల పెంప కం వంటి పనుల చేపట్ట ను న్నామని తెలిపారు. ఇప్పటికే 90 ఎకరాల్లో దీనిని పైలట్ ప్రా జెక్ట్‌గా విజయవంతంగా అమ లు చేశామని, తద్వారా 286 మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ మూడు అంచెల సాగు విధానం ద్వారా రైతులకు స్వల్పకా లికంగా కూరగాయల సాగుతో ఏడాదికి ?40,000 నుండి ?60,000 వరకు, ఉద్యానవన పంటల ద్వారా దీర్ఘకాలికంగా ?60,000 నుండి ?2 లక్షల వ రకు వార్షిక ఆదాయం లభి స్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు కు కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె), ఉద్యానవన పరిశోధనా సంస్థ లు, ఐటీడీఏ నర్సరీల ద్వారా అవసరమైన సాంకేతిక సహ కారం అందిస్తున్నట్లు ఆయన ఉన్నతాధికారులకు వివరిం చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డీఓ రవీందర్, నీతి ఆ యోగ్ ప్రోగ్రాం అధికారి రాహు ల్, ఇతర అధికారులు, తదిత రులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసి తరలించిన ధాన్యం
# సి.ఎం.ఆర్. ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో రైస్ మిల్లర్లు ధాన్యం సి.ఎం.ఆర్. ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్‌లతో కలిసి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సోమవారం సమీక్ష సమావేశంను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలింపు జరుగుతుందన్నారు.గత ఖరీఫ్ లక్ష్యాలు పూర్తి చేసిన రైస్ మిల్లర్లు ఈసారి కేటాయించిన ధాన్యం లక్ష్యాల సాధనను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి లారీల ద్వారా తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకోవాలని, రోజుకు 10 నుంచి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకోసం అవసరమైన హమాలీల సంఖ్యను పెంచుకోవాలని, ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారులతో సమన్వయం చేసుకుని కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ అండ్ స్పోర్ట్స్' వారోత్సవాలకు శ్రీకారం

**గోడపత్రిక ఆవిష్కరించిన కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్: మే 18 ప్రజా జ్యోతి** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాలను ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కే. హరిత తెలిపారు. ఆదివారం ఐడీఓసీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. యువతలో క్రీడలపై ఆసక్తి పెంపొందించడం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిల్లో ఆరు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యువత, ఎన్‌జీవోలు, యూత్ క్లబ్‌లు, యువజన, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**ఆరు రోజుల షెడ్యూల్ ఇలా...**

మే 18: 'ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ' పేరుతో జిల్లా, మండల స్థాయిల్లో 2కే మారథాన్ రన్. మే 19: జిల్లా స్థాయిలో కెరీర్, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన. మే 20: యువతకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ. మే 21: జిల్లా స్థాయిలో 'స్పోర్ట్స్ డే'. మే 22: మండల, జిల్లా స్థాయిల్లో 'స్వచ్ఛ తెలంగాణ' కోసం శ్రమదానం. మే 23: జిల్లా స్థాయిలో ఉద్యోగ సాధన కార్యక్రమాలు. కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి అశ్వక్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## దొంగలున్నారు..
## తస్మాత్ జాగ్రత్త..!

**38 డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్ పూదరి విజయరాణి తిరుపతి**




**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):** మంచి ర్యాల పట్టణంలోని 38 డివిజన్ పరిధిలోని కాలనీల్లో దొంగలు సంచరిస్తున్నట్లు సమా చారం అందిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 38 డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి పూదరి విజయరాణి తిరుపతి కోరారు.ఆదివారం రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్--3లో ఒక ఇంట్లో దొంగతనం జరిగినట్లు తెలిసిందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో డివిజన్ ప్రజలు రాత్రి వేళల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి తలుపులు, గేట్లు బిగించి ఉంచడంతో పాటు, అనుమానా స్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రాత్రి పహారా వంటి చర్యలపై ప్రజలు దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండి, ఒకరికి ఒకరు సహకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పూదరి విజయరాణి తిరుపతి తెలిపారు.

## కమనీయంగా కామరతి బీరప్ప కళ్యాణ వేడుక



బాసర, మే 18 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో సోమవారం కామరతి బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత కమనీయంగా, కంటిపండు వగా జరిగింది. గత వారం రోజులుగా ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా, ఈ రోజు ప్రధాన ఘట్టమైన కళ్యాణ వేడుకను కురుమ సంఘం సాంప్రదాయాల ప్రకారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర పూజా మహోత్సవంలో ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటేష్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లింగరావు, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు, ప్రముఖ నాయకులు రమేష్‌లు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఈ ప్రముఖులను కుర్మ సంఘం పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వైభవంగా అన్నదానం బీరప్ప స్వామి కళ్యాణోత్స వాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం సర్పంచ్ వెంకటేష్ గౌడ్ స్వయంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాసర మరియు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కళ్యాణ వేడుకను కళ్లారా వీక్షించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో, భక్తి కోలాహలంతో మురిసిపోయింది.

## ఉట్నూర్ రాజుల కోటను సం దర్శించిన ఐటిడిఏ ప్రాజెక్టు అ ధికారి మంద మకరంద్



ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి) సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ఉట్నూర్ ప్రాజె క్టు అధికారి మంద మకరంద్ సోమవారం ఉదయం ఉట్నూర్ కేంద్రంలోని చారిత్రాత్మక రాజుల కోటను సందర్శించారు. ఈ సందర్భంగా కోట యొక్క చారిత్రక ప్రాముఖ్యత, గిరిజన సంస్కృతి వారసత్వం, నిర్మా ణ వైశిష్ట్యాలను స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను అ డిగి తెలుసుకున్నారు.రాజుల కోట గిరిజన ప్రాంత చరిత్రకు ప్రతీకగా నిలుస్తోందని, ఈ కోటకు ప్రత్యేకమైన చారిత్రకగు ర్తింపు ఉందని ఆయన పేర్కొన్నారు. కోట చరిత్ర, వైభవం, గిరిజన సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా తెలిసేలా అందమైన సుందరీ కరణ పనులు చేపడతామని తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని వెల్లడించారు. అదేవిధంగా కోట పరిసర ప్రాంతాలను శుభ్రంగా, ఆకర్ష ణీయంగా తీర్చిదిద్దడంతో పా టు, సందర్శకులకు అవసర మైన మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటా మని తెలిపారు. గిరిజనుల చారిత్రక వారసత్వాన్ని భావి తరాలకు అందించేందుకు ప్ర భుత్వం ప్రత్యేక దృష్టి సారి స్తోందన్నారు. ఈ సందర్భంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్థ మనుగడే లక్ష్యం.. ఉత్పత్తి ఉత్పాదకత పెంపుపై ఉద్యోగులకు దిశానిర్దేశం

## శ్రీరాంపూర్ ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాల ప్రారంభం





మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి): నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత సాధనే లక్ష్యంగా ఉద్యోగులను కార్యోన్ముఖుల ను చేసే దిశగా సింగరేణి యాజమాన్యం ప్రతిష్ఠాత్మకం గా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు శ్రీరాంపూర్ ఏరియాలో సోమవారం ప్రారంభమ య్యాయి. సంస్థ వాస్తవ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, బొగ్గు నాణ్యత, ఉత్పత్తి ఖర్చులు, మార్కెట్ పోటీ తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ ఈ సమావేశాలు నిర్వహించారు. మొదటి రోజు ఆర్కే-7 భూగర్భగనిలో టీం-1 ఆధ్వర్యంలో, జీఎం కార్యాలయంలో టీం-2 ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్కే-7 గనిలో ఉదయం షిఫ్ట్, జనరల్ షిఫ్ట్, నైట్ డ్యూటీ ఉద్యోగులకు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు, రెండో షిఫ్ట్ ఉద్యోగులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్పత్తి--ఉత్పాదకతపై డీజీఎం (ఐఈడీ) రాజన్న, ఆర్థిక వ్యవహారాలు మరియు లాభనష్టాలపై ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, నాణ్యత ప్రాధాన్యతపై హనుమాన్ గౌడ్, రక్షణ అంశాలపై ఏఎస్ఓ విజయ్ కుమార్, సంక్షేమ కార్యక్రమాలపై డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ ఉద్యోగులకు వివరణ ఇచ్చారు.సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, సంస్థ మనుగడ కోసం చేపట్టాల్సిన చర్యలపై కమిటీ కన్వీనర్ ఎస్.ఓ.టూ జీఎం ఎన్. సత్యనారాయణ దిశానిర్దేశం చేశారు. గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య ఉద్యోగులు సంస్థ అభ్యున్నతే లక్ష్యంగా విధులు నిర్వహించాలని కోరారు.అలాగే మధ్యాహ్నం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో కార్యాలయ సిబ్బంది, ఇంటర్నల్ ఆడిట్, డిస్పెన్సరీ సిబ్బందికి ఉత్పత్తి లక్ష్యాల సాధనలో సపోర్టింగ్ డిపార్ట్మెంట్ల పాత్రపై అవగాహన కల్పించారు. ఉత్పత్తి ఉత్పాదకతపై ఈఈ (ఐఈడీ) సాయికిరణ్, యంత్రాల వినియోగంపై ప్రాజెక్ట్ ఇంజనీర్ కృష్ణారావు, ఆర్థిక పరిస్థితులపై డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ నరేష్, నాణ్యతపై మహేష్, సేఫ్టీపై అమర్నాథ్, సంక్షేమ కార్యక్రమాలపై రాజేష్ వివరించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి బొగ్గుకు మార్కెట్లో పోటీ పెరిగిందని, నాణ్యత లోపాలు మరియు ఉత్పత్తి వ్యయాల పెరుగుదల కారణంగా టన్నుకు సుమారు రూ.700 వరకు ధర తగ్గించాల్సి వస్తోందని తెలిపారు. దీని వల్ల సంస్థకు ఏటా దాదాపు రూ.4 వేల కోట్ల నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు రక్షణ ప్రమాణాలు పాటిస్తూ యంత్రాల వినియోగ సమయం పెంచి సంస్థ మనుగడకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల ఉపాధి కేంద్రాలైన భూగర్భ గనుల జీవితకాలాన్ని పెంచడం అత్యంత ముఖ్యమన్నారు. సపోర్టింగ్ డిపార్ట్మెంట్లు ఎలాంటి జాప్యం లేకుండా విధులు నిర్వహిస్తూ గనులు, ఉపరితల గనుల ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సహకరించాలనిసూచించారు మంగళవారం టీం-1 ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ-3 గనిలో, టీం-2 ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ-1 గనిలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేష్

## సిరికొండలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

సిరికొండ, మే 18, (ప్రజా జ్యోతి)ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం కోసం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటే ష్ అన్నారు. సిరికొండ మండల కేంద్రం లోసిరికొండ సిరి సం పద సొసైటీ చైర్మన్ గోర్బండ్ ప్రకాష్ ఆధ్వర్యంలో జొన్న కొ నుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్కె ట్ కమిటీ చైర్మన్ తో పాటు సి రికొండ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొద్దు ద త్త్రాత్రి పాల్గొని మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని, ఎటువంటి అవకతకులు జరగకుండా సంయమనం పాటిస్తూ అందరి రైతుల చివరి గింజ వరకు కొనిపించే బాధ్యత మాది అని భరోసానిచ్చారు. కొందరు స్వార్థరాజకీయ నాయకుల మాటలు నమ్మి రైతులు ఆగ మాగం కాకూడదని, రైతులకు అందుబాటులో ఉంటూసొసై టీ సభ్యులు రైతుల సమస్యల ను వేణువెంటనే పరిష్కరిస్తూ రైతులకు సహకరిస్తూ కొనుగో లు కేంద్రాన్ని విజయవంత చే యాలని అన్నారు. ఈ కార్య క్రమంలో



ముఖ్య అతిథులు గా ఎమ్మార్వో తుకారం, ఎంపీ డీవో సంతోష్ కుమార్, ఏఈ శ్రద్ధారాణి, ఏఎస్ఐ రమేష్ సిరి కొండ ఉప సర్పంచ్ తోకల రాజు, సర్పంచులు లక్ష్మణ్, లక్ష్మి కాంత్, సూర్యకాంత్, ప్రవీణ్, మాజీ సర్పంచులు సూర్య కాంత్ సొసైటీ డైరెక్టర్లు తోకల చందు, బాను ప్రసాద్, శంకర్, గ్రామ పెద్దలు బాలాజీ, మాధ వ్ పటేల్ గ్రామస్తులు పాల్గొ న్నారు .

## 5 కే మారథాన్ లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలో సోమ వారం నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 5కే మారథాన్ కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మా రథాన్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ రావు, మున్సిప ల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన పాల్గొని యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడా స్ఫూర్తి పెంపొందించాల్సిన అవసరాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడ లకు ప్రాధాన్యం ఇవ్వాలని అ న్నారు. ఇలాంటి కార్యక్రమా లు యువతను మంచి మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువత, క్రీడాకారులు, అధికారులు తది తరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**పోలీస్ ముఖ్య కార్యాలయం లో 41 ఫిర్యాదుల నమోదు**

**జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారులు**

**భార్యాభర్తల, తండ్రి కొడుకుల సమస్యలు, కేసుల పు రోగతు లు, భూ తగాదాల పై సమస్య లను విన్న వించుకున్న ఫిర్యా దు దారులు**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదే శించారు. ప్రతి సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల రోజును నిర్వహించడం జరుగుతుందని ప్రజలు నిర్భయంగా ఎలాం టి సమస్యలున్న జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించ వ చ్చని జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ తెలియజేశారు. సోమవారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన 41 ఫిర్యాదుదారు లు నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. సమస్య లను విన్న వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఫోన్ ద్వారా ఆదేశాలి చ్చి, ప్రజా సమస్యలను తక్ష ణమే పరిష్కరించాలని సూ చించారు. ఈరోజు వచ్చిన ఫిర్యాదుదారులలో ముఖ్యంగా కుటుంబ కలహాలు భార్యాభర్తల, సమస్యలు, తండ్రీ కొడుకుల సమస్యలు, భూతగాదాలు, కొట్లాటల సమస్యలు, వివిధ కేసుల పురోగతులపై తమ సమస్యలను తెలియజేశారు. జిల్లాలో ఎలాంటి అసాం ఘిక కార్యకలాపాలపై సమా చారం ఉన్న వెంటనే 871265 9973 నంబర్‌కు వాట్సప్ ద్వారా సమాచారం అందించ వచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ వాట్సాప్ నంబర్ నేరుగా జిల్లా ఎస్పీ చే నిర్వ హించబడుతుంది. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్టర్ నెంబర్:74/ 2026 తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో

ఉద్యమకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కు

హైదరాబాద్ లోని బూర్గుల రామకృష్ణ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించి:

ఉద్యమకారుల సమస్య లను వివరిస్తూ వినతి పత్రం అందజేసిన:

తెలంగాణ ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి బుర్ర సోమేశ్వర్ గౌడ్:

అన్ని జిల్లాలు తిరుగుతూ సమగ్రమైన రిపోర్టు ఆధారంగా నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేసే దిశగా కమిటీ పని చేస్తుంది::

ఉద్యమకారుల సంక్షేమ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్:





**మే 17, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** హైదరాబాద్ టి.యు.వి రిజిస్టర్ నెంబర్:74/2026 తెలంగాణ ఉద్యమ కారు ల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర చైర్మన్ రాళ్ల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర సోమేశ్వర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమం కోసం నియమించిన కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్సీ,తెలంగాణ ఉద్యమకారులు రాములు నాయక్‌కు హైదరాబాద్ లోని బూర్గుల రామకృష్ణ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించడం జరిగిందని తెలిపారు. శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించా మని అన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కారుల సమస్యలను వివరించి, విశ్లేషించి, క్రుప్తకరించి వారితో మాట్లాడి వినతి పత్రం అందజేయడం జరిగిందని తెలిపారు.తెలంగాణ ఉద్యమ కారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర సోమేశ్వర్ గౌడ్ మాట్లాడు తూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సర్వం త్యాగం చేసి ఇబ్బందుల పాలై ఎన్నో అవమానాలు భరించి తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు ఉద్యమ సమయంలో ఎన్నో కార్యక్రమాలో పాలు పంచుకొని తన వంతు కృషి చేసి ఎఫ్ఐఆర్, బైండ్వార్ కేసులు నమోదైన అర్హులైన నిజ మైన ఉద్యమకారులను గుర్తించి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీ రోజున ఉద్యమకారులకు ఉద్యమ గుర్తింపు కార్డు, అందజేసి 25 వేల రూపాయల పెన్షన్, ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు, ఫ్యామిలీ హెల్త్ కార్డ్, ఇన్సూరెన్స్, రైల్వే,బస్సు పాస్, ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సంక్షేమ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఉద్యమకారుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ వారు మాట్లాడుతూ... అన్ని జిల్లాలు తిరుగుతూ సమగ్రమైన రిపోర్టు తీసు కొని నిజమైన ఉద్యమ కారులకు న్యాయం చేసే దిశగా ఈ కమిటీ పని చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ ఉద్యమకారుల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు రాములు నాయక్ తెలిపారని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర సోమేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

**సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మ కరంద్**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18 (ప్రజా జ్యోతి)** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజ ల నుంచి అందిన దరఖాస్తుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉ ట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధి కారి మంద మకరంద్ అధికా రులను ఆదేశించారు. సోమ వారం ఐటీడీఏ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్య లపై ప్రజల నుంచి అర్జీలు స్వీ కరించారు.ఇంద్రవెల్లి మండలం పాతాగూడ గ్రామానికి చెం దిన గేడం రాములు తనకు బోర్‌వెల్ మంజూరు చేయా లని వినతిపత్రం సమర్పించారు. మంచిర్యాల మండలం కో టపల్లి గ్రామానికి చెందిన సౌందర్య ఆశ్రమ పాఠశాలలో ఉ ద్యోగావకాశం కల్పించాలని కోరారు. ఉట్నూర్ మండలంచి క్రాంగూడ గ్రామానికి చెందిన సోయం రాధాబాయి గొర్రెల లోన్ మంజూరు చేయాలని అర్జీ పెట్టుకున్నారు. వాంకిడి మండలం సర్కెపల్లి గ్రామానికి చెందిన భీంరావ్ సోలార్ పం పుసెట్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అదిలాబాద్ మండలం పీహె చ్ సీ కాలనీకి చెందిన శ్రీనివాస్ పీఎం జన్మన్ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, సాత్నాల మండలం మెడిగూడ గ్రామా నికి చెందిన శ్యాంసుందర్ త మ గ్రామానికి రహదారి సౌక ర్యం కల్పించాలని దరఖాస్తు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సం బంధించిన సమస్యల పరి ష్కారం కోసం అర్జీలు అంద జే శారు. ఈ కార్యక్రమంలో సం బంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రూరల్ సీఐ గా రహీం పాషా

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కి పూల మొక్క అందజేసి బా ధ్యతల స్వీకరణ**

**అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, ఆర్థిక నేరాల అరిక ట్టడంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని సూచన**

**రామగుండం కమిషనరేట్ నుండి ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బదిలీ**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** ఇటీవల మల్టీ జోన్ వన్ ఐజి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వు ల ప్రకారం జిల్లాలో నలుగురు సిఐల బదిలీ అయ్యారు. అం దులో భాగంగా ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా బదిలీ అయిన రహీం పాషా సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి బాధ్య తలను స్వీకరించారు. రహీం పాషా గతంలో నార్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఆదిలాబాద్ జిల్లాలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలా పాలు, ఆర్థిక నేరాలు జరగ కుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి పూర్తిగా రూపుమాపే దిశగా కృషి చేయాలని సూచించారు. గతంలో రామగుండం కమిషనరేట్ పరి ధిలో విధులు నిర్వర్తించి ఇటీ వలే సాధారణ బదిలీల్లో భా గంగా ఆదిలాబాద్ రూరల్ సీఐగా సోమవారం బాధ్యత లను స్వీకరించానున్నారు.

## పెట్రోల్ బంక్ ఆపరేటర్లకు వేతనాలు పెంచండి

**ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేత**



**ఆసిఫాబాద్ మే 18 ప్రజా జ్యోతి** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటీడీఏ జీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న నాజిల్ ఆపరేటర్లకు కనీస వేతనం నెలకు రూ.15 వేలకు పెంచాలని కోరుతూ సోమవారం వివిధ మండలాలకు చెందిన ఆపరేటర్లు ఐటీడీఏ పీవో మకరంద్ ఐఏఎస్కు వినతిపత్రం అందజేశారు. వారి డిమాండ్లకు జాతీయ మానవ హక్కుల కమిటీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరేళ్లుగా ఐటీడీఏ జీసీసీ పరిధిలో పనిచేస్తున్న ఆపరేటర్లు చాలీచాలని రూ.8,500 వేతనంతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు డ్యూటీలు చేస్తూ కనీసం రోజువారీ కూలీ కూడా గిట్టని దుస్థితిలో ఉన్నారన్నారు. ఐటీడీఏ పీవో, ప్రభుత్వం స్పందించి రోజుకు రూ.500 చొప్పున నెలకు కనీసం రూ.15 వేలు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వడ్డెర కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**67 ద్విచక్ర వాహనాలు, 16 ఆ టోలు, 2 ట్రాక్టర్లు స్వాధీనం**

**98 దేశిదారు, 12 లిక్కర్ బా టిల్ స్వాధీనం, ముగ్గురిపై కే సులు నమోదు**

**అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చట్టరీత్యాచర్యలు**

**ప్రజల సంరక్షణ, భద్రత కైక మ్యూనిటీ కాంటాక్ట్ల నిర్వాహణ**

**100మంది సిబ్బందితో ఉదయం 5 గంటల నుండి 9 వరకు తనిఖీలు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**





**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** ప్రజల రక్షణ, సంరక్షణ సక్ర మంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహిం చడం జరుగుతుందని ఆది లాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీలో ఉదయం ఐదు గం టల నుండి 8 గంటల వరకు 100 మంది సిబ్బందితో క మ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటు వంటి 67 ద్విచక్ర వాహనాలు, 16 ఆటో లను, రెండు ట్రాక్టర్ల ను స్వాధీనం చేసుకోవడం జ రిగిందని తెలిపారు. తనిఖీ ల లో 98 దేశీ దారు, 12 లిక్కర్, బాటిల్లను స్వాధీనం చేసుకోవ డం జరిగిందని, ముగ్గురుపై కేసులు నమోదు చేయడం జరు గుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉం డాలని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలుని ర్వహించ కుండా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత ను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా సత్ప్రవర్తనతో మెదలాలని తెలిపారు. ఇదివరకే కేసులలో నమోదైన వారిపై స స్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం జ రుగుతుందని, ఇంతకీ మారని పక్షంలో చివరగా పీడీ యాక్ట్ సైతం నమోదు చేయడం జ రుగుతుందని హెచ్చరించారు. దొంగతనాలు చేసే వారి, నేరా లు చేసే వారి సమాచారం పో లీసులకు అందజేయాలని, కా లనీకి మంచి పేరు తీసుకువ చ్చేలా కృషి చేయాలని తెలి పారు. విద్యార్థులకు చిన్నప్ప టినుండి చదువుపై ఆసక్తి పెం చేలా తల్లిదండ్రులు కృషి చే యాలని, దొంగతనాలు అ సాంఘిక కార్యకలాపాలు చేయకుండా పర్యవేక్షించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడప కుండా ఉండాలని, ముఖ్యంగా ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నియ మ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించే దుకు సక్రమంగా వాహనాల ను నడుపుతూ ఉండాలని తె లిపారు. వాహనాలను వితౌట్ నంబర్ ప్లేట్ నడపడం, లైసె న్సు లేకుండా నడపడం చట్టరీ త్య నేరంగా పరిగణించ బడు తుందని,అలాంటి చేయ కుం డా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఏఆర్ డీఎ స్పీ కమతం ఇంద్రవర్ధన్, పట్ట ణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, ప్రణయ్ కుమా ర్, కె ఫణిదర్, కె స్వామి, బిడి ప్రేమ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పె క్టర్ లు డి వెంకటి,టి మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్ఐలు రాధిక, విష్ణువర్ధన్, ఎస్సైలు దే వేందర్, విష్ణు ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా ప్రారంభమైన "జన్ జాతీయ గరిమ ఉత్సవ్"



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఐటీడీఏ పీవో మంద మకరంద్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18 (ప్రజా జ్యోతి)** ఉమ్మడి జిల్లాలో మే 18 నుం డి 25వ తేదీ వరకు నిర్వహిం చనున్న "జన్ జాతీయ గరిమ ఉత్సవ్" కార్యక్రమాన్ని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యా లయ ఛాంబర్లో సోమ వా రం జ్యోతి ప్రజ్వలన చేసి, గిరి జన వీరుడు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి ప్రాజెక్ట్ అధికారి శ్రీ మంద మకరంద్ ఘనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో సం బంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చే యడం, సమస్యలను ప్రత్య క్షంగా తెలుసుకొని తక్షణ పరి ష్కారం అందించడం ఈ ఉత్స వాల ముఖ్య ఉద్దేశ్యమని తెలి పారు. మే 18 నుండి 25 వర కు నిర్వహించనున్న ప్రత్యేక క్యాంపులలో కుల ధృవీకరణ పత్రాలు (కాస్ట్ సర్టిఫికెట్లు), ఆ దాయ ధృవీకరణ పత్రాలు, రే షన్ కార్డులు, పెన్షన్లు, ఆధార్ కార్డులు, హెల్త్ సర్టిఫికేట్లు తదితర సేవలకు దరఖాస్తులు స్వీకరించి ప్రజలకు సహాయం చేయనున్నట్లు తెలిపారు.అలాగే ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేయడం, రక్తహీనత (అనీమియా), క్షయవ్యాధి (టీబీ)తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.గ్రామాలలో పాదయాత్రలుని ర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గిరిజన ప్రాంత ప్రజలు సద్వినియోగం చే సుకోవాలని అధికారులు విజ్ఞ ప్తి చేశారు.

# జిల్లాలో బాల్య వివాహాల నివారణలో విశేష సేవలు అందిస్తున్న పోలీస్ అక్క బృందం

**స్వయంగా సమాచారం అంది స్తున్న పాఠశాల విద్యార్థులు**

**షి టీం బృందం తో ప్రత్యేక పర్యవేక్షణ**

**2025 లో 11, 2026 లో 23 నిలిపివేసిన బాల్య వివాహాలు**

**పోలీస్ అక్క సిబ్బంది తో సమావేశం ఏర్పాటు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** బాల్య వివాహాల నిర్మూలనకు ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శా ఖ ప్రత్యేక చర్యలు చేపడుతు న్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. సోమవారం పోలీస్ అక్క సిబ్బందితో పోలీస్ ముక్య కా ర్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీస్ అక్క, షీ టీం బృందాలు నిరంతరం అవగా హన కార్యక్రమాలు నిర్వహి స్తూ, ఫిర్యాదులపై తక్షణ స్పం దనతో చర్యలు తీసుకుంటు న్నాయని పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో మొత్తం 11 బా ల్య వివాహాలను అడ్డుకోగా, అందులో పోలీస్ అక్క బృం దం 3, షీ టీం 8 కేసుల్లో కీలక పాత్ర పోషించిందన్నారు. 202 6 సంవత్సరంలో ఇప్పటి వర కు మొత్తం 23 బాల్య వివాహా లను అడ్డుకోగా, పోలీస్ అక్క బృందం 20, షీటీం 3 కేసుల్లో స్పందించి బాలికల భవిష్యత్తు ను కాపాడినట్లు తెలిపారు. పాఠశాలలు, గ్రామాలు, కళాశాలల్లో నిరంతరం అవగాహా న కార్యక్రమాలు నిర్వహిస్తూ తల్లిదండ్రులకు చట్టాలపై అవ గాహన కల్పిస్తున్నామని తెలి పారు. బాల్య వివాహాలు నిర్వ హిస్తే చట్టపరమైన చర్యలు త ప్పవని హెచ్చరించారు. గత నె లలో పోలీస్ అక్క సిబ్బంది 225 గ్రామాలను సందర్శించి, 207 అవగాహన కార్యక్రమా లు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 15 ఈ పెట్టి కేసులు నమోదు కావడం జరిగిందని తెలిపారు. పాఠశాలలు, గ్రామాలను సందర్శించి వేధింపులపై మరింత సమాచారం సేకరించాలని, మహిళలు న్యాయం చేయాలని తెలిపారు. ప్రస్తుతం జరుగు నేరాలను తెలిపి చైతన్య పరచడం చేయాలని తెలిపారు. బాల్య వివా హాలపై అనుమానాస్పద స మాచారం తెలిసిన వెంటనే డయల్–100 లేదా సమీప పో లీస్ స్టేషన్‌కు సమాచారం అం దించాలని ప్రజలకు విజ్ఞప్తి చే శారు. జిల్లాలో ప్రతి బాలిక విద్యను కొనసాగించి, సురక్షి త భవిష్యత్తు వైపు అడుగు లు వేయాలనే లక్ష్యంతో పోలీ స్ శాఖ పనిచేస్తోందని జిల్లా ఎస్పీ తెలిపారు. స్వయంగా సమాచారం అందిస్తున్న పాఠ శాల విద్యార్థులు, అది అభి నందనీయం అని తెలిపారు. నెల రోజులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అక్క సి బ్బందికి ప్రశంసా పత్రాలు అం దజేసి అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సిఐ లు బి డి ప్రేమ్ కుమార్, కె ఫణిదర్, షి టీం సిబ్బంది సుశీల, వాణిశ్రీ, లావణ్య, రో హిణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బంగారు ఆభరణాల దుకాణాలలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలి

**అత్యాధునిక సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డ్, మెటల్ డిటెక్ట ర్స్ ఏర్పాటు ఉత్తమం**

**బంగారం కొనుగోలు చేసే ముందు సరైన పత్రాలు సరి చూసుకోవడం**

**పట్టణంలోని బంగారు దుకా ణాల యజమానులు కళాకా రులచే సమావేశం**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 18, (ప్రజా జ్యోతి)** బంగారు ఆభరణాల దుకాణా లలో భద్రత చర్యలు తప్పని సరిగా పాటించాలని, అత్యా ధునిక సీసీ కెమెరాలు, సెక్యూ రిటీ గార్డ్ మెటల్ డిటెక్టర్ ఏ ర్పాటు చేసుకోవాలని ఆది లాబాద్ ఎస్పీ అఖిల్ మహాజ న్ అన్నారు. సోమవారం పోలీ స్ హెడ్ క్వార్టర్స్ లో ఆదిలా బాద్ పట్టణంలోని బంగారు ఆభరణాల దుకాణ యజమా నులు, నిర్వాహకులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్ ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేసి పలు సూచనలు చే శారు. జిల్లాలో ముఖ్యంగా మ హారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో బంగారు దుకాణాల యజమా నులు పూర్తి అప్రమత్తంగా ఉం డాలని సూచించారు. దొంగత నాలు జరగకుండా దుకాణాల లోపల, బయట ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవా లని, మోషన్ సెన్సార్ అలర్ట్ సిస్టమ్, సైరన్ అలారంలు, సె న్సార్ అలర్ట్ పరికరాలు విని యోగించాలని తెలిపారు. సీసీ కెమెరాల డీవీఆర్ ను సురక్షిత ప్రదేశంలో భద్రపరచాలని సూ చించారు. పట్టణంలోని అశోక్ రోడ్డు లో అధిక రద్దీ ఉండే నే పథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ తో పాటు, పార్కింగ్ విషయం లో ప్రత్యేక చర్యలు చేపట్టాల ని తెలిపారు. ఆధునిక సాంకే తిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టా లని తెలిపారు. పట్టణంలోని పెద్ద పెద్ద షాపులలో ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది నియమిం చుకోవడంతో పాటు రాత్రి వే ళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మెటల్ డిటెక్టర్, డీఎఫ్ఎండీ పరికరాలు వినియోగించాలని తెలిపారు. సెకండ్ హ్యాండ్ బంగారం కొనుగోలు సమ యంలో యాజమాన్య పత్రా లు పూర్తిగా పరిశీలించాలని, దొంగ బంగారం కొనుగోలు చే యవద్దని హెచ్చరించారు. తె లిసిన వ్యక్తుల వద్ద మాత్రమే బంగారం కొనుగోలు చేయాల ని, ఫుల్ డాక్యుమెంట్ వెరిఫి కేషన్ తప్పనిసరిగా చేయాల ని సూచించారు. ఫేక్ గోల్డ్ మో సాలపై అప్రమత్తంగా ఉండా లని తెలిపారు. ప్రతి రోజు డై లీ 100, పెట్రోల్ కాల్స్ సిబ్బం దిచే గస్తీ నిర్వహిస్తూ ఉండడం జరుగుతుందని, పాయింట్ బుక్స్ నిర్వహించాలని అధి కారుల ఆదేశించారు. అను మానాస్పద వ్యక్తులు, దొంగల సమాచారాన్ని వెంటనే డయ ల్–100 కు అందించాలని తెలి పారు. అదనంగా ఇంటర్‌సెప్ట ర్ వాహనాల సహాయంతో గ స్తీ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మాక్ డ్రిల్స్, రి హార్సల్స్ నిర్వహిస్తూ భద్రతా ప్రమాణాలు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి సునీల్ కుమార్, బంగారు దుకాణ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు దేవిదాస్, సెక్రటరీ క ట్టారాజు, మాజీ అధ్యక్షుడు భాస్కరాచారి, బి శ్రీనివాస్, బంగారు దుకాణ యజమానులు, వ్యాపారులు, నిర్వాహకులు, కళాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక వారోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 18 ,( ప్రజాజ్యోతి ).**"ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా పర్యాటక వారోత్సవాలకు సంబంధించి గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సోమవారం రాత్రి, కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. పర్యాటక వారోత్సవ కార్యక్రమాలను విజయవం తం చేయాలని కలెక్టర్ తెలిపారు. గోడ ప్రతులను ఆవిష్కరించిన వారిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డివైస్ఓ శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## పొగలో ప్రజల వంటలు... ప్రచారాల్లో మాత్రమే అభివృద్ధి

**గ్యాస్ కొరతపై కట్టెల పొయ్యితో నిరసన తెలిపిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, 18, మే (ప్రజా జ్యోతి):**గ్యాస్ కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందు లను ప్రతిబింబిస్తూ, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం కట్టెల పొయ్యిపై స్వయంగా వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "దేశం అంతర్జాతీయ వేదికలపై గొప్పగా కనిపించడం ఒక వైపు అయితే, గ్రామాల్లో ప్రజలు గ్యాస్ సిలిండర్ లేక మళ్లీ కట్టెల పొయ్యిలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరం. ఇది కేంద్ర ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనం" అని అన్నారు. గ్యాస్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళలు మళ్లీ పొగలో వంట చేయాల్సి రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచారాల కంటే ప్రజల ప్రాథమిక అవసరాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని, గ్యాస్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు స్పందిస్తూ, వారి తరపున పోరాటం కొనసాగిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

# పేదల సొంతింటి కల నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

రేవంత్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లకు వేగం

లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అందిస్తాం

మాజీ సర్పంచ్ సెండే దత్తు హామీ



**ఆసిఫాబాద్ మే 18 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గుండి గ్రామ పంచాయతీ పరిధిలో రాస్పల్లి సౌజన్య-కుమార్ దంపతులకు మంజూరైన ఇంటి స్లాబ్ పనులను మాజీ సర్పంచ్ సెండే దత్తు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించడమే లక్ష్యమని తెలిపారు. లబ్ధిదారులకు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ దాస్పల్లి శ్యామ్‌రావు, 6వ వార్డు సభ్యుడు చెన్నవేని రాజేష్, మాజీ ఉప సర్పంచ్‌లు బట్టుపల్లి శేషాద్రి, బొమ్మకంటి భారతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుసుల్ల సత్యన్న, భీమన్కర్ మురళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# బోరిగాం పరిధిలోని ఎస్టీవో కాలనీలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన విద్యుత్ స్థంభం

అధికారుల నిర్లక్ష్యం పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు శూన్యం

బడ్జెట్ లేదనే కారణంతో కాలయాపన చేస్తున్న అధికారులు: ఆ స్తంభం ఏ క్షణానైనా పడిపోయే పరిస్థితి దాపురించింది: ప్రజల చిన్నపిల్లల ప్రాణాల భద్రతపై పట్టింపు లేదా? ఇదేనా? మీ బాధ్యత విద్యుత్ శాఖ ఎస్ఈ, డిఈ,ఏఈలను:బి ప్రశ్నించిన?న్యాయవాది జావిద్ అలీ ఖాన్:



**మే 18, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మండలం,బోరిగాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీవోస్ కాలనీలో ప్రమాదకరంగా వంగిపోయిన విద్యుత్ స్థంభం విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని న్యాయవాది జావిద్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆ స్థంభం ఎప్పుడైనా పడిపోయే దాపుర పరిస్థితిలో ఉందని అన్నారు. దీనివల్ల స్థానిక ప్రజల ప్రాణాలకు, ముఖ్యంగా చిన్నపిల్లలకు తీవ్రముప్పుగా మారిందని అన్నారు. న్యాయవాది జావీద్ అలీ ఖాన్ పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ , "బడ్జెట్ లేదనే" కారణంతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఈఎస్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా,డిఈ సిర్పూర్ కాగజ్ నగర్, ఏఈ రూలర్ లకు స్థానిక ప్రజల ప్రాణాల భద్రతపై పట్టింపు లేదా అని, ఇదే మీ బాధ్యత అని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ జిల్లా అధికారులు ఇప్పటికైనా వెంటనే స్పందించి ఆ ప్రమాదకర విద్యుత్ స్థంభాన్ని తొలగించి మరమ్మతులు చేయాలని లేదా మార్చా లని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఈ విషయాన్ని ఉన్నత అధికారులు అదే విధంగా మీడియా దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని అడ్వకేట్ జావిద్ అలీ ఖాన్ విద్యుత్ శాఖ అధికారులను సూచించారు.

## పూలే బాటలో నడవాలి

సమాజ మార్పునకు విద్యే ఆయుధమన్న సుగుణక్క

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

ఖిరిడిలో ఘనంగా విగ్రహావిష్కరణ



**ఆసిఫాబాద్ మే 18 ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఖిరిడి గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇంచార్జి శ్యామ్ నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కలిసి పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక సమానత్వం కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని పూలే చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షులు నారాయణ మాలి సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ నాగార్జున గౌడ్‌కు సన్మానం

దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దని వినతి



**ఆసిఫాబాద్ మే 18 ప్రజా జ్యోతి** ఇటీవల బదిలీపై వచ్చి కెరమెరి మండలానికి నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన పి. నాగార్జున గౌడ్‌ను సోమవారం జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్, బీజేపీ మండల నాయకుడు పవర్ రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడుతూ.. కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారుల పనులను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కుల ధ్రువీకరణ పత్రాలను పెండింగ్‌లో ఉంచకుండా సిబ్బందికి సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

## అడవుల రక్షణ అందరి బాధ్యత

అటవీ రక్షణకు అందరి సహకారం అవసరం

మాక్‌డ్రిల్‌లో డీఎఫ్‌వో బాలామణి పిలుపు




**ఆసిఫాబాద్ మే 18 ప్రజా జ్యోతి** అడవులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ విషయంలో అందరూ బాధ్యతగా మెలగాలని జిల్లా అటవీశాఖ అధికారి బాలామణి అన్నారు. ఆకస్మిక అటవీ అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల సమన్వయాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో సోమవారం కాగజ్‌నగర్ డివిజన్‌లోని వేంపల్లి ఫారెస్ట్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో బాలామణి మాట్లాడుతూ.. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విపత్తు నిర్వహణ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా స్పందించాలి, ఎలా అదుపు చేయాలన్న అంశాలపై అవగాహన కోసం ఈ డ్రిల్ చేపట్టామన్నారు. అటవీ, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖలతో కలిపి మొత్తం 19 శాఖలు ఇందులో పాల్గొన్నాయని తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం అటవీశాఖకు అందరూ సహకరించాలని కోరారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా సమీపంలోని పెద్దబండ, కోసినీ గ్రామాలకు చెందిన 80 మందిని వేంపల్లి హరిణి పార్క్ రీ-హ్యాబిటేషన్ సెంటర్‌కు తరలించారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో అప్పయ్య, ఏఎంపీఐ రాజశేఖర్, అబ్జర్వర్ క్రాంతి, డీపీఆర్వో సంపత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు